Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 188 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 4 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## ఇంధన ధరలు పెరుగుతాయా? ప్రభుత్వం ఏం చెబుతోందంటే..



**ఇంటర్నెట్ డెస్క్:** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దేశాలు సంయుక్తంగా యుద్ధం కొనసాగిస్తున్నాయి. ఇప్పటికే ఆదేశ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అంతమొందించిన భద్రతా బలగాలు.. ఇంకా దాడుల పరంపరను కంటిన్యూ చేస్తున్నాయి. మరోవైపు ఇరాన్ సైతం తగ్గడం లేదు. ప్రతీకార దాడులతో చెలరేగిపోతోంది. ఇజ్రాయెల్, అమెరికాపై దాడి చేస్తూనే.. ఇరాన్ చుట్టూ ఉన్న వాటి మిత్ర దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైనా విరుచుకుపడుతోంది. దీంతో మధ్యప్రాచ్యంలో యుద్ధం తీవ్ర ఉద్రిక్తతలను రేపుతోంది. ఈ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ సహా మధ్యప్రాచ్య దేశాల నుంచి భారత్ అనేక ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీంతో ఈ యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇరాన్, గల్ఫ్ కంట్రీస్ నుంచి చమురు, గ్యాస్, విలువైన ఖనిజాలు, ఎలక్ట్రానిక్ గూడ్స్‌ని భారత్ దిగుమతి చేసుకుంటుంది. అయితే, యుద్ధం నేపథ్యంలో ఇరాన్.. రవాణా కేంద్రమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. హోర్ముజ్ జలసంధిని మూసి వేయడంతో భారత్‌కు వచ్చే ఆయా ఉత్పత్తుల రవాణా నిలిచి పోయింది. దీంతో మన దేశంలో వీటి ధరలు విపరీతంగా పెరిగిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం, వెండి, ఎరువులు, వ్యవసాయ పరికరాల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**టెన్షన్ అవసరం లేదు..**

మార్కెట్ వర్గాల అంచనాలు అలా ఉంటే.. ప్రభుత్వ వర్గాలు మాత్రం టెన్షన్ పడాల్సిన అవసరం లేదని చెబుతున్నాయి. ముడి చమురు, గ్యాస్ విషయంలో కంగారు పడాల్సిందేమీ లేదంటున్నారు. ఈ విషయంలో భారత్ కంఫర్ట్ జోన్‌లోనే ఉందంటున్నారు. 'ముడి చమురు, ఎల్‌పిజి, ఎల్ఎన్‌జిల విషయానికొస్తే టెన్షన్ పడాల్సిన పనిలేదు. ప్రస్తుతం 25 రోజులకు సరిపడా ముడి చమురు నిల్వలు ఉన్నాయి. మరో 25 రోజులకు సరిపడా ఉత్పత్తులు రవాణాలో ఉన్నాయి.' అని ప్రభుత్వ వర్గాలు జాతీయ మీడియాకు తెలిపాయి.

## దుర్గగుడిలో మహా కుంభాభిషేక మహోత్సవం.. సీఎంకు ఆహ్వానం




**విజయవాడ, (రాజధాని వార్తలు):** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 6 నుంచి 8 వరకు కుంభాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ మహోత్సవానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి ఆలయ అధికారులు ఆహ్వానం అందజేశారు. మంగళవారం దుర్గా దేవస్థానం పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, ఆలయ ఈవో శీనా నాయక్.. సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అర్చకులు స్వామి వార్ల చిత్రపటం, ప్రసాదం అందజేసి.. సీఎంకు ఆశీర్వచనాలు అందించారు.

**మంత్రి లోకేశ్‌కు ఆహ్వానం...**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరిగే కుంభాభిషేక మహోత్సవానికి మంత్రి నారా లోకేశ్‌కు ఆహ్వానం అందించారు అధికారులు. కుంభా భిషేకానికి రావాల్సిందిగా లోకేశ్‌కు దేవస్థానం అర్చకులు, పాలక వర్గం ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఆగమ శాస్త్రాల ప్రకారం 12 ఏళ్లకు ఒకసారి ఇంద్రకీ లాద్రిపై మహా కుంభాభిషేకం నిర్వహిస్తారు. ఈ మహాకుంభాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 6 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు జరిగే మహా కుంభాభిషేకానికి భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉంది.

## కలెక్టర్లకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** కలెక్టర్ల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యక్రమాల్లో వార్డు సభ్యులు, సర్పంచులు, కార్పొరేటర్లు, మేయర్లు తప్పనిసరిగా భాగస్వాములవ్వాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులకు జిల్లా కేంద్రాల్లో ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సోలార్ విద్యుత్ వినియోగంపై గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు సీఎం. రైతులకు సోలార్ పంప్ సెట్లు ప్రోత్సాహం అందిస్తామన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు గ్రామ, వార్డు సభల్లో ప్రజలకు వెల్లడించాలని సీఎం సూచించారు. రాష్ట్రంలోని 35 ప్రభుత్వ మెడికల్ కాలేజీల సేవలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను సీఎం రేవంత్ ఆదేశించారు. అన్ని సంక్షేమ పథకాలలో ఫేషియల్ రికగ్నిషన్ అమలు చేయాలని.. అనర్హులను తొలగించాలని దిశానిర్దేశం చేశారు. రవాణా శాఖ డేటా పూర్తిగా ఆన్‌లైన్ చేయాలని.. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించాలన్నారు. రోడ్ల గుంతల సమాచారం కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు చేయాలన్న సీఎం.. ఓఆర్ఆర్, సర్వీస్ రోడ్లపై చెత్త డంపింగ్ చేయడంపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్కూళ్లలో మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు ప్రతి నెలా సమయానికి చెల్లించాలన్నారు. నగరాల్లో వర్కింగ్ ఉమెన్స్, బాయ్స్-గర్ల్స్ హాస్టళ్ల నమోదు, పర్యవేక్షణ ఉండాలన్నారు. పాఠశాలలు, కాలేజీల్లో డ్రగ్స్, గంజాయి వినియోగంపై విద్యాసంస్థలు కఠినంగా ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ప్రతి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలో సైకాలజిస్టులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి రైతులకు సరైన పంటలపై మార్గదర్శనం ఇవ్వాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. యూరియా యాప్ సులభీకరణ, నానో యూరియా ప్రయోజనాలపై క్షేత్ర స్థాయి ప్రదర్శనలు చేపట్టాలన్నారు. వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు సీఎం. జిల్లాల వారీగా పంటల వైవిధ్యంపై కలెక్టర్లు నివేదికలు సమర్పించాలన్నారు.

## వెంకటగిరి వైసీపీలో అంతర్గత పోరు.. కౌన్సిలర్ల తిరుగుబాటు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటగిరి మున్సిపాలిటీలో అధికార వైసీపీలో అంతర్గత పోరు నెలకొంది. ప్రస్తుత మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై వైసీపీ కౌన్సిలర్లు తిరుగుబాటు చేశారు. కౌన్సిలర్లకు ఇంకా 15 రోజులు గడువు ఉండగా.. మున్సిపల్ ఛైర్ పర్సన్‌పై తిరుగుబాటు బావుటా ఎగురవేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గతేడాది అంటే.. 2025లోనే ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రవేశ పట్టారు. ఈ నేపథ్యంలో సదరు నియోజకవర్గం వైసీపీ పార్టీ ఇంచార్జ్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి రంగంలోకి దిగారు. పార్టీ పరువు కాపాడేందుకు కౌన్సిలర్లకు లబ్ధి చేకూర్చడం ద్వారా ఆ అవిశ్వాసం వీగిపోయేలా చేశారు. అనంతరం వైసీపీతోపాటు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డికి ఛైర్ పర్సన్ నక్కా భానుప్రియ ముఖం చాటేశారు. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై సొంత పార్టీ కౌన్సిలర్ల చేత నేదురు మల్లి రాంకుమార్ రెడ్డి తిరుగుబాటు చేయిస్తున్నారంటూ ఒక జోరు చర్చ అయితే వెంకటగిరి నియోజక వర్గంలో సాగుతోంది. మరో వైపు అవిశ్వాస ప్రక్రియ వేళ తమ మాట వినకుండా పార్టీ ఇంచార్జ్ నేదురుమల్లి మాటే విన్నారని కౌన్సిలర్‌పై ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ బావ నక్కా వెంకటేశ్వర్లు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అలాగే ప్రతీ నెల




సమావేశాలు పెట్టకుండా కౌన్సిలర్లు, ఛైర్మన్ కల వకుండా ఉండేలా చేయడం కోసం నక్కా వెంకటేశ్వర్లు తీవ్ర ప్రయ త్నాలు చేస్తున్నారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయానికి ఛైర్మన్ వెళ్లకుండా నక్కా వెంకటేశ్వర్లు హుకుం జారీ చేశారు. ఇక మున్సిపల్ అధికారుల చేత ఆఫీస్ ఫైల్స్ ఇంటికి తెప్పించుకొని మరి.. నక్కా వెంకటేశ్వర్లు ఛైర్మన్‌గా పెత్తనం సాగిస్తున్నారంటూ విమర్శలు వెల్లు వెత్తాయి. ఛైర్మన్ పదవిలో నక్కా భానుప్రియను రబ్బర్ స్టాంప్‌గా మార్చి.. ఆమె బావ నక్కా వెంకటేశ్వర్లు పెత్తనం చేస్తున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ కౌన్సిలర్లను లక్ష్యంగా చేసుకుని టీడీపీ శ్రేణులు ప్రశ్నల వర్షం కురిపిస్తోంది. ఆ ప్రశ్నలకు వైసీపీ కౌన్సిలర్లు సమాధానం చెప్పలేకపోతున్నారు. అలాంటి పరిస్థితుల్లో రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో మన పరిస్థితి, మన పార్టీ పరిస్థితి ఏమిటంటూ వెంకటగిరి వైసీపీ నేతలు అంతర్గత ఆలోచనలతో సతమతమవుతున్నారు.

## వీబీ జీ రామ్ జీ పథకం గ్రామీణాభివృద్ధికి గణనీయమైన అవకాశాలను అందిస్తుంది : చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాద్ రావు

### - కేంద్ర పథకాలపై పిఐబి విజయవాడ ఆధ్వర్యంలో చిత్తూరులో వార్తాలాప్ మీడియా వర్క్‌షాపు









**చిత్తూరు. (రాజధాని వార్తలు):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు చేరవేయడంలో మీడియా కీలక వారధిగా పనిచేయాలని చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమల్ల ప్రసాద్ రావు మీడియా ప్రతినిధులను కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వీబీ జీ రామ్ జీ పథకంపై ఈ రోజు (03 మార్చి 2026) చిత్తూరులో నిర్వహించిన "వార్తాలాప్ మీడియా వర్క్ షాప్"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత ప్రభుత్వ ప్రచార విభాగమైన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి), విజయవాడ ఈ వార్తాలాప్ కార్యక్రమాన్ని నిర్వహించింది. విలేకరులు ఖచ్చితమైన, బాధ్యతాయుతమైన, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే వార్తలను ప్రజలకు చేరువ చేయాలని ఆయన కోరారు. ప్రజలకు అందుబాటులో ఉన్న అవకాశాల వారికి తెలిపేలా, అవగాహన పెంపొందించేలా వాస్తవ సమాచారాన్ని అందించేందుకు కృషి చేయాలని ఎంపీ ప్రసాద రావు సూచించారు. వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణాభివృద్ధి. సామాజికాభివృద్ధి. గ్రామీణ జీవనోపాధికి మెరుగైన అవకాశాలు దక్కుతాయని ఎంపీ ప్రసాదరావు అన్నారు. ఈ పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్లో తగినన్ని నిధులను కేటాయించిందని వెల్లడించిన ఆయన.. బ్యాంకింగ్ వ్యవస్థ మద్దతుతో నడిచే స్వయం ఉపాధి పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సాధికారతను ప్రోత్సహించే వివిధ కేంద్ర పథకాల గురించి ప్రస్తావించారు. వివిధ అంశాలపై ప్రాంతీయ జర్నలిస్టులకు అవగాహన కల్పించడంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో చేస్తున్న ప్రయత్నాలను ఎంపీ ప్రసాదరావు అభినందించారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని గ్రామీణ ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు మీడియాను బలోపేతం చేయడమే ఈ వర్క్షాప్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మీడియా వర్క్ షాప్లో పాల్గొన్న వివిధ మీడియా సంస్థల ప్రతినిధులను ఎంపీ అభినందించారు. ప్రజాస్వామ్యంలో మీడియాను నాలుగో స్తంభంగా పరిగణిస్తారని.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, విజయవాడ డైరెక్టర్ జి.సురేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు, కొత్త నిర్ణయాలు, ప్రజాప్రతినిధుల పర్యటనలపై విలేకరులకు ప్రామాణికమైన సమాచారాన్ని సకాలంలో అందిచడంలో పిఐబి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై మీడియాకు మరింత అవగాహన కల్పించేందుకు వార్తాలాప్ వంటి కార్యక్రమాలు సహాయ పడతాయని వివరించారు. గోపిచంద్, ఉపాధి పథక రాష్ట్ర చీఫ్ క్వాలిటీ అండ్ కంట్రోల్ ఆఫీసర్, మాట్లాడుతూ.. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవిక మిషన్ (గ్రామీణ్) పథకం (ఏబీ జీ రామ్ (గ్రామీణ్) గ్రామీణ కుటుంబాలకు ఒక ఆర్థిక ఏడాదికి 125 రోజుల వేతనంతో కూడిన ఉపాధికి చట్టబద్ధమైన హామీని అందిస్తుందని తెలిపారు. ఉపాధికి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు పని లభించకపోతే నిరుద్యోగ భృతిని అందిచడంతో పాటు, చేసిన పనికి సకాలంలో వేతనం పొందేందుకు స్పష్టమైన నిబంధనలున్నాయని వివరించారు. వ్యవసాయ రంగంలో కీలక సాగు సమయాల్లో కూలీన కొరతను నివారించేందుకు తప్పనిసరి 60 రోజుల "వ్యవసాయ విరామం" వంటి నిబంధనల గురించి మీడియా ప్రతినిధులకు వివరించారు. ఉపాధి హామి పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు. పారదర్శకతను నిర్ధారించేందుకు ముఖ గుర్తింపు సాంకేతికత, ఏఐ సాధనాలు, జియోస్పేషియల్ మ్యాపింగ్ వంటి ఆధునాతన డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించనున్నారు.

దీంతో అవినీతికి తావు లేకుండా నిధులు నేరుగా లబ్దిదారులకు చేరుతాయి. గ్రామ పంచాయతీలే ఈ పథకానికి ప్రాథమిక అమలు సంస్థలుగా వ్యవహరించనున్నాయి. ఈ పథకానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. ఇందులో నీటి భద్రత, గ్రామీణ మౌలిక సదుపాయాలు. విపత్తు నిర్వహణా సంసిద్ధత, సోలార్ లైటింగ్. గ్రామీణ గ్రంథాలయాలు వంటి కొత్త కార్యక్రమాలకు ప్రాధాన్యత నిచ్చారు. ఈ వార్తాలాప్ కార్యక్రమంలో ఎంజిఎన్ఆర్ఆజిఎస్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, చిత్తూరు లీడ్ బ్యాంక్ అధికారులు ఎ.హరీష్, చిత్తూరు జిల్లా నీటి నిర్వహణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జాతీయ మాజీ అధ్యక్షులు ఎంపి రాహుల్ గాంధీని కలిసిన నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా "సృజన సంఘటన్ అభియాన్" పేరుతో తెలంగాణలోని వికారాబాద్‌లో కాంగ్రెస్ జిల్లా పార్టీ అధ్యక్షులకు 10 రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ, ఈ కార్యక్రమం పూర్తయ్యాక శిక్షణా శిబిరానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన రాహుల్ గాంధీ ఐజజ అధ్యక్షుకుల్లో ఉత్సాహం నింపారు. పార్టీ బలోపేతానికి, భవిష్యత్తులో ఆచరించాల్సిన ప్రణాళికలపై చర్చించారు. వికారాబాద్ హరిత రిసార్ట్‌లో "సంఘటన సృజన్ అభియాన్" కార్యక్రమం భాగంగా నిర్వహించిన డీసీసీ అధ్యక్షుల పది రోజుల శిక్షణ శిబిరం ఘనంగా ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాహుల్ గాంధీ, కేసి వేణు గోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్కం ఠాగూర్, ఏపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలా రెడ్డి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విచ్చేసి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్, తదితరులు కూడా పాల్గొన్నారు. పది




రోజుల పాటు కొనసాగిన ఈ శిక్షణ శిబిరంలో పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధి, ప్రజలతో అనుసంధానం, ఎన్నికల వ్యూహరచన వంటి అంశాలపై సమగ్ర చర్చలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన డీసీసీ అధ్యక్షులు తమ తమ జిల్లాల రాజకీయ పరిస్థితులు, బూత్ స్థాయి నిర్మాణం, ప్రజా సమస్యలపై పార్టీ స్పందన తదితర అంశాలను విశ్లేషిస్తూ అనుభవాలను పంచుకున్నారు. "సంఘటన సృజన్" ప్రోగ్రామ్ చైర్మన్ సచిన్ రావ్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా వంశీ చందర్ రెడీ, ఎమ్మెల్యే పరిగి రాంమోహన్ రెడ్డి నేతృత్వంలో ఈ శిబిరం సమర్థవంతంగా నిర్వహించబడింది. వివిధ రంగాల నిపుణులు నాయకత్వ నైపుణ్యాలు, ప్రజా సమస్యల పరిష్కార విధానాలు, సోషల్ మీడియా & మీడియా నిర్వహణ, ఎన్నికల వ్యూహరచన, కార్యాచరణ ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలపై శిక్షణ అందించారు. రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో శిక్షణా శిబిరం ముగిసింది. నెల్లూరు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకు వస్తా... డిసిసి అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి. ఉమ్మడి నెల్లూరు జిల్లా ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేదని గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ నుండి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం సైతం అధిరోహించిన చరిత్ర ఉందని, ఎందరో రాజకీయ నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఓ పాఠశాల లాంటిదని రాష్ట్ర విభజన తర్వాత పార్టీ కొంత వెనకపడినప్పటికీ ఇప్పుడు పరిస్థితిలో మార్పు వస్తుందని కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రంలో కానీ దేశంలో కానీ సమగ్ర అభివృద్ధి సాధ్యం అవుతుందని దేశంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేయగల పార్టీ కాంగ్రెస్ ఒక్కటే అని ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా రావాలన్నా ప్రజలకు సంక్షేమం అభివృద్ధి సమానంగా అందాలన్నా ఒక్క కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఇప్పటికీ ఉమ్మడి నెల్లూరు జిల్లా లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్నప్పుడు అభివృద్ధి చేసిన కృష్ణపట్నం పోర్టు, శ్రీ సిటీ, మేనకూరు, ఇఫ్కో సెజ్ ప్రత్యేక ఆర్థిక మండళ్లు ఏర్పాటు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు నాటివేనని అవి తప్ప కొత్తగా ఈ ప్రభుత్వాలు చేసింది శూన్యం అని ప్రజలు ఈ విషయాలు దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

# కలెక్టరేట్‌కు క్యూ కట్టిన అర్జీదారులు

### - నిర్ణీత గడువులాగా అర్జీలను పరిష్కరించాలి : జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను సోమవారం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయ్ కుమార్, డిప్యూటి కలక్టర్ మురళి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శ్రీధర్ రెడ్డి, డిపిఓ వసుమతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డి.డి నాగశేఖర్, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు మరియు పింఛన్లకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్.యల్.ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వులు నెం. 06 ను అనుసరించి జిల్లాలోని అన్ని శాఖలలో అర్హత కలిగిన వారందరికీ త్వరితగతిన పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అవసరమైన శాఖలలో పానల్ జాబితాలను తయారు చేసి పదోన్నతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని శాఖలలో ఎప్పటినుంచో సర్వీస్ లో ఉంటూ పదోన్నతులు పొందని వారు ఇంకా ఉన్నారని క్రిమినల్ కేసులు లేని శాఖపరమైన కేసులు లేని వారందరికీ అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ వారి పేర్లతో వివిధ శాఖలలో మనుగడలో లేని అకౌంట్లు వివరాలను అందించాలని ఆయన అధికారులకు సూచించారు. ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లును జిల్లా అధికారులు చేపట్టారు. వీటిలో సహాయకులతో కూడిన అర్జీల స్వీకరణ కౌంటర్లు, రిసెప్షన్ సదుపాయం, జిల్లా మరియు మండల స్థాయి అధికారుల హాజరు, వికలాంగులకు ప్రత్యేక సదుపాయాలు, తాగునీటి సౌకర్యం, అర్జీల పర్యవేక్షణ, ప్రత్యేక క్యూ లైన్లు తదితర ఏర్పాట్లు చేయడంతపాటు షామ్యానలు వేసి నీడను కల్పించారు. సోమవారం జరిగిన ప్రజాపిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదుల స్వీకరణ త్వరితగతిన పరిష్కారానికి డివిజనుల వారీగా రెవెన్యూ క్లినిక్ ప్రత్యేక కౌంటర్లను తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసి అర్జీల సత్వర పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమములో డిప్యూటి కలెక్టర్ మురళి, డి.పి.ఓ వసుమతి, పి.డి. డి.ఆర్.డి.ఎ నాగ రాజకుమారి, బి.సి సంక్షేమ అధికారి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గడప దాటలేని దివ్యాంగులకు గమ్యం చూపిన వి.పి.ఆర్ ఫౌండేషన్

### - కావలి, కందుకూరు, కోవూరు నియోజకవర్గాలకు చెందిన 10 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణి - అధికారం అనేది ప్రజలకు సేవ చేయడానికి దక్కిన ఒక అవకాశం - వి.పి.ఆర్ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగుతాయి : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పరుల బాధను తమ బాధగా భావించి, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడమే పరమావధిగా నమ్మే వేమిరెడ్డి దంపతులు మరోసారి తమ ఉదారతను చాటుకు న్నారు. నడవలేని పాదాలకు విపిఆర్ ఫౌండేషన్ తోడయింది. నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని తమ నివాసంలో కావలి, కందుకూరు మరియు కోవూరు నియోజకవర్గాలకు చెందిన 10 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. నడవలేక, ఇతరులపై ఆధార పడలేక బతుకు భారమైపోతున్న తరుణంలో తమ మొర ఆలకించి బ్యాటరీ ట్రై సైకిళ్ల అందచేసిన విపిఆర్ ఫౌండేషన్ నిర్వాహకులైన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలకు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియచేశారు. అధికారం అనేది ప్రజలకు సేవ చేయడానికి దక్కిన ఒక అవకాశమని ప్రతి దివ్యాంగుడు ఆత్మవిశ్వాసంతో బతకాలన్నదే తమ ఆకాంక్ష అని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. వి.పి.ఆర్ ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని ఆమె స్పష్టం చేశారు.

# ఎంట్రన్స్ పరీక్షలలో ప్రతి ఒక్కరు అర్హత సాధించి తమ కలలు సాకారం చేసుకోవాలి

### - అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్





**డక్కిలి ప్రతినిధి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా డక్కిలి మండలం అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల నందు బాలికలకు ఈరోజు 5వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మరియు ఐ ఐ టి నీట్ ఎంట్రన్స్ పరీక్షలను వ్రాయుటకు వచ్చిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ స్వర్ణలత వైస్ ప్రిన్సిపాల్ నాగమణి మరియు చైర్మన్ తెలుగుదేశం పార్టీ నాయకులు సర్వేపల్లి రత్నయ్య ఆల్ ది బెస్ట్ చెప్పి పరీక్షలలో ప్రతి ఒక్కరు అర్హత సాదించి, తమ కలలు సాకారం చేసుకోవా లని చదువులలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. వారి ఆధ్వర్యంలో పరీక్షలకు వచ్చిన విద్యార్థినిలకు వారి తల్లితండ్రులకు చల్లటి మజ్జిగ చల్లని మంచినీళ్ళను సరఫరా చేయడం జరిగింది. ఈసందర్భంగా ఈ పరీక్షలకు రాయడానికి వచ్చిన విద్యార్థులు అందరూ జాగ్రత్తగా ఇంటికి వెళ్లాలన్నారు టిడిపి నాయకులు సర్వేపల్లి రత్నయ్య



మాట్లాడుతూ పరీక్షా రాయడానికి వచ్చిన విద్యార్థులందరూ పరీక్ష బాగా వ్రాసి అలాగే మంచి మార్కులతో ఉత్తీర్నాలు అవ్వాలని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు ఆడపిల్లల చదువు ఇంటికి వెలుగు అని అందువల్ల వాళ్లని బాగా చదివించి మంచి స్థాయికి తీసుకురావాలని వారి తల్లిదండ్రులకు తెలియజేశారు.

# నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డిని పరామర్శించిన వేమిరెడ్డి దంపతులు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** టిడిపి సీనియర్ నాయకులు, నెల్లూరు సెంట్రల్ బ్యాంక్ మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పరామర్శించారు. ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన జగన్మోహన్ రెడ్డికి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఆయన.. ప్రస్తుతం నెల్లూరులోని తన కుమార్తె నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వారి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోడూరు కమలాకర్‌రెడ్డి, కోట మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఘనంగా రంగనాథుని 'హనుమంత వాహన' సేవ

**నెల్లూరు (రంగనాయకులపేట), (రాజధాని వార్తలు):** నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన సోమవారం రాత్రి స్వామివారు అత్యంత వైభవంగా హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 9-00 గంటలకు రమణీయంగా అలంకరించిన హనుమంత వాహనంపై రంగనాథస్వామి వారు అధిష్ఠించి విహరించారు. భగవంతుడికి అత్యంత ప్రియ భక్తుడైన హనుమంతునిపై స్వామివారు విహరి స్తున్న దృశ్యం భక్తులను పరవశింపజేసింది. వాహన సేవ పొడ వునా భక్తులు గోవింద నామస్మరణలతో స్వామివారికి మంగళ హారతులు సమర్పించారు. కోలాట బృందాలు, మంగళ వాయి ద్యాలు, భజనల మధ్య ఉత్సవం వైభవంగా సాగింది. ఈ కార్యక్ర మమునకు ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, ఫెస్టివల్ కమిటి సభ్యులు లెక్కల వెంకట రెడ్డి, దూబిశెట్టి కల్యాణి, అద్దంకి చంద్ర శేఖర్, రంగాచారి వెంకటేష్ మరియు తిరుమల వింజమూరు నరసింహాచార్యులు, దేవస్థాన సిబ్బంది, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు.



# అన్ని వర్గాలను అలరించేలా 'సంప్రదాయని సుద్దిని సుద్దపూసని'




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీ శివాజీ ప్రొడక్షన్ బ్యానర్‌పై శివాజీ, లయ జంటగా నటించిన సరికొత్త చిత్రం "సంప్రదాయని సుద్దిని సుద్దపూసని". ఈ నెల 6వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ఆది వారం ఉదయం విశాఖపట్నంలో మీడియా సమావేశాన్ని నిర్వ హించింది. ఈ సందర్భంగా హీరో శివాజీ, హీరోయిన్ లయ చిత్ర విశేషాలను పంచుకున్నారు. హీరో శివాజీ మాట్లాడుతూ ఇది ఒక విభిన్నమైన డార్క్ కామెడీ చిత్రమని తెలిపారు. గతంలో లయ-నేను కలిసి చేసిన మూడు సినిమాలను ప్రేక్షకులు ఎలా గైతే ఆదరించారో, ఈ సినిమాను కూడా అలాగే ఆదరించాలని కోరుతున్నాను. సాంకేతిక పరంగా అత్యున్నత ప్రమాణాలు పాటిం చాం. ముఖ్యంగా సినిమా ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తి కరంగా ఉంటుంది. మాస్టర్ రోహన్ పాత్ర అద్భుతంగా నటిం చాడు అని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై స్పందిస్తూ ఒక పక్క ప్రజల కోసం మాట్లాడుతూనే, మరోపక్క కుటుంబాల కోసం సినిమాలు చేస్తాను. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రజల శ్రేయస్సు కోసం నా గళం వినిపిస్తూనే ఉంటాను. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలి, లేదంటే ఇక్కడి వారు ఉపాధి కోసం మళ్లీ హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్త్రీ వస్త్రధారణపై తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని, అవి తన వ్యక్తిగత భావనలు మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. హీరో యిన్ లయ మాట్లాడుతూ విశాఖపట్నంతో తనకున్న అనుబం ధాన్ని గుర్తు చేసుకున్నారు. నా తాతగారి స్వస్థలం విశాఖ కావ డంతో చిన్నప్పుడు ఇక్కడే పెరిగాను. ఈ చిత్రంలో నా పాత్ర పేరు 'ఉత్తర'. భర్త మీద చూపించే అతి ప్రేమ ఎలాంటి ఇబ్బం దులకు దారి తీస్తుందనే అంశాన్ని కామెడీగా, వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఇది కేవలం ఫ్యామిలీ సినిమా మాత్రమే కాదు, అన్ని వయసుల వారు చూసి ఎంజాయ్ చేసేలా ప్రమోట్ చేయాలని కోరుతున్నాను అని తెలిపారు.

# సేవే ధ్యేయం కావాలి

## - ప్రతి ఒక్కరూ సామాజిక సమస్యలపై స్పందించాలి - నవ వధువుకు బంగారు తాళిబొట్టు, పట్టుబట్టలు అందజేసిన డాక్టర్ కందుల దంపతులు

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సేవే ధ్యేయంగా ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. 35వ వార్డు, కళ్ళపాకలు ప్రాంతా నికి చెందిన నవ వధువు బి.తిరుమలకు డాక్టర్ కందుల నాగరాజు, నళినీ దేవి దంపతులు బంగారు తాళిబొట్టు, పట్టు బట్టలు, పసుపు కుంకుమ అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ నేటి యువత సామాజిక అంశాలపై విరివిగా స్పందించాలన్నారు. ఇతరులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. మానవత్వంతో స్పందించి అర్హులైన వారికి సహాయం చేస్తే, వారిని చూసి మరి కొంతమంది ముందుకు వచ్చి, వారి బాటలోనే నడుస్తూ, మంచి పనులు చేసేందుకు వెనకడుగు వేయరని చెప్పారు. తమ కెఎన్ఆర్ చారిట బుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మందికి సేవలు అందించడం జరిగిం దన్నారు. సేవే పరమావధిగా భావించి, ఇతరులకు మంచి చేయ డమే లక్ష్యంగా పెట్టుకుని, తన వార్డు పరిధి మేరకే కాకుండా




విశాఖ దక్షిణ నియోజకవర్గ మొత్తం అంతా తన సేవలను విస్తృత పరిచినట్లు వెల్లడించారు. ఎవరికైనా కష్టం వస్తే అక్కడ తాను ఉంటానని, ఒక కుటుంబ సభ్యుడిగా వారి సమస్యలను పరిష్కరిం చడం తన బాధ్యతగా భావిస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కే.అప్పారావు, గౌరీ, గాజుల శ్రీను, కుమారి, వరలక్ష్మి, కోదండమ్మ, నీలిమ, అర్జునమ్మ, తలుపులమ్మ, భారతి, భవాని తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మెమోరాండం






**రేణిగుంట, (రాజధాని వార్తలు):** వర్క్‌షాప్‌ను సోమవారం సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవత్సవ సందర్శించారు. సి.ఆర్.ఎస్ చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ శ్రీనివాస్ జీఎంని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం జీఎం సి.ఆర్.ఎస్ పరిధిలోని వివిధ షాపులను సందర్శించి కార్మికుల పనితీరు, కోచ్‌ల మరమ్మతుల నాణ్యతపై పరిశీలించారు. కోచ్‌లను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేస్తున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిడబ్ల్యూఎం శ్రీనివాస్ కార్మికులు పనులను నాణ్యతపరంగా సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని జీఎంకి వివరించారు.తదుపరి అడ్మినిస్ట్రేషన్ విభాగానికి విచ్చేసిన జీఎంని సి.ఆర్.ఎస్ మజ్దూర్ యూనియన్ కార్యవర్గం శాలువాతో సత్కరించి పలు సమస్యలపై మెమొరాండం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ సెక్రటరీ కాళహస్తి బాబు, చైర్మన్ సదాశివరెడ్డి జీఎంకి సమస్యలను వివరించారు. వర్క్‌షాప్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, అన్ని షాపులకు ఇన్సెంటివ్‌ను 50 శాతం తగ్గకుండా ఇవ్వాలని కోరారు. అలాగే వర్క్‌షాప్‌లో సరెండరింగ్ పోస్టులను నిలిపివేయాలని, సి.ఆర్.ఎస్ హాస్పిటల్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లు మరియు రేడియో గ్రాఫర్ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కోర్ యాక్టివిటీ పనులను ఉద్యోగులకే ఇవ్వాలని, నాన్‌కోర్ యాక్టివిటీ పనులను కాంట్రాక్టులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ మరియు రైలు కళ్యాణ్ కోసం కొత్త భవనాలు నిర్మించాలని, శిథిలా వస్థలో ఉన్న రైల్వే క్వార్టర్లను తొలగించి కొత్త వాటిని నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మికు లకు నాణ్యమైన వైద్యం అందించేందుకు మెరుగైన హాస్పిటల్‌కు రిఫరల్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.ఎస్ మజ్దూర్ యూనియన్ సెక్రటరీ కాళహస్తి బాబు, చైర్మన్ సదాశివరెడ్డి, ట్రెజరర్ మునికుమార్, హెన్రీ పాల్, ముని రాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌సిఈఎస్ వేడుకలలో సేవా పురస్కారం అందుకున్న కంచర్ల



**ఒంగోలు, (రాజధాని వార్తలు):** ఒంగోలు నగరంలోని కేశవస్వామి పేట వద్ద శ్రీప్రసన్న చెన్న కేశవ స్వామి ఆలయంలో జాతీయ పురస్కార వేడుకలు ఎస్ ఎల్ సి పి ఎస్ కళానిలయము ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమ వారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి సంస్థ సెక్రటరీ కె.బుచ్చెశ్వర్ రావు అధ్యక్షత వహించారు. ఈ వేడుకలకు సేవా పురస్కారం సీనియర్ జర్నలిస్టు కంచర్ల మల్లికార్జునరావు అందుకున్నారు. అనంతరం సామాజికవేత్త, సీనియర్ జర్నలిస్ట్ కంచర్ల మల్లికార్జునరావు మాట్లాడుతూ సేవా సంస్థ సెక్రెటరీ బుచ్చె శ్వర్ రావు భవిష్యత్తులో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఆయనకు ఆరోగ్య, ఐశ్వర్యంలను ప్రసాదం చాలని చెప్పారు. పలువురిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల పరిరక్షణ కమిటీ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కే శృతి, నేషనల్ డైరెక్టర ఇండస్ట్రియల్ రిలేషన్స్ వర్కర్స్ బోర్డ్. షేక్ సిద్ధాంబి కార్యక్రమంలో ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ కొలకలూరి రవి బాబు, సెక్రెటరీ బుచ్చేశ్వర్‌రావు, వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ జాతీయ ఉపాధ్యక్షురాలు డాక్టర్ కే శృతి, నేషనల్ డైరెక్టర్ ఇండస్ట్రియల్ రిలేషన్స్ వర్కర్స్ బోర్డ్ సిద్ధాంబి, ఐసిడిఎస్ సిడిపిఓ, కళ్యాణి వర్మ, ఒంగోలు భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ వెంకట రమణ, డాక్టర్ మద్దాలి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం దృష్టికి మరోసారి జర్నలిస్టులు పెండింగ్ సమస్యలు

## - మార్చి 4న భారీ ర్యాలీ మంత్రులు సమక్షంలో సభ
## - నేడు చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను మరోసారి కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని ఇందుకోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని.. రాష్ట్ర వ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికే ఆయా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి (నేషనల్ అలెయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణ, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావులు తెలిపారు. ఈ మేరకు సోమవారం అక్కయ్యపాలెం జంక్షన్ లోని ఒక ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌లు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వీరు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టులకు సంబంధించిన 11 డిమాండ్ల సాధన కోసం చాలా కాలంగా తమ యూనియన్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. అయితే ఇందులో అక్రిడేషన్‌లు సమస్య కొంత కొలిక్కి వచ్చిందన్నారు. ఇక మిగిలిన డిమాండ్‌లకు సంబంధించి మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తమ రాష్ట్ర కార్యవర్గం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రధానంగా జర్నలిస్టుల ఇంటి కల నెరవేరలేదని ప్రభుత్వాలు మారుతున్నా కనీసం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇండ్లు కేటాయించడం లేదన్నారు. అలాగే జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ప్రమాధ భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, ఇతర రాష్ట్రాల్లో జర్నలిస్టులకు అమలు చేస్తున్న పెన్షన్ విధానం అమలు చేయాలని, మీడియా హక్కుల పరిరక్షణకు ప్రత్యేకంగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులకు కార్పొరేట్ సంస్థల నుంచి ఉచితంగా విద్య, వైద్యం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తామంతా కోరుతున్నామన్నారు. ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భారీగా రాయితీలు, ప్రోత్సాహకాలు అందజేస్తున్న తరుణంలో సమాజం కోసం పాటు పడుతున్న జర్నలిస్టులకు వారి కుటుంబాలకు కార్పొరేట్ సంస్థల నుంచి ఉచితంగా విద్య, వైద్యం అందించాలన్నారు. జర్నలిస్టులకు ప్రముఖుల పేరుతో ఉన్న అవార్డులు అందజేయాలని వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలనిజర్నలిస్టులకు సంబంధించిన కమిటీలు ఏర్పాటు చేయాలని కార్మిక భీమా సదుపాయం కల్పించాలని మొత్తం 11 డిమాండ్లతో ఇప్పటికే తాము దశల వారీగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇతర ప్రముఖులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో మరోసారి వర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వంలో పెద్దల దృష్టికి తీసుకువెళ్లాలని తమ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు. రేపు చలో విజయవాడవర్కింగ్ జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ మార్చి 4న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించాలని తమ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.నారాయణలు తెలిపారు. ఆరోజు ఉదయం విజయవాడలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తామని క్రమేపీ అది సభగా మారుతుందన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న జర్నలిస్టుల సభకు అతిథులుగా రాష్ట్ర సమాచార, పౌరసంబందాల శాఖామంత్రి కొలుసు పార్ధసారధి, కార్మిక శాఖమంత్రి వాసంశెట్టి సుభాష్‌లను ఆహ్వానించడం జరిగిందన్నారు. మంత్రులు హాజరుకానున్న ఈ సభలో జర్నలిస్టుల సమస్యలు వివరించి వాటి పరిష్కారాన్ని కోరుతామన్నారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వీరు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు రవికుమార్, ప్రసాద్ ఉపాధ్యక్షులు ఎన్ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి గణేష్ రెడ్డి, నగేష్ బాబు బ్రాడ్ కాస్ట్ అధ్యక్షులు ఈశ్వరరావు, కార్యదర్శి కింతాడ మదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవత్రినాథ్, కార్యదర్శిలు శేషు, నేల రాజు, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, కార్యదర్శి బొబ్బర ప్రసాద్, సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, శర్మ, జగన్నాథం, హరి తదితరులు పాల్గొన్నారు.

# రూ. కోటి పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

## - ప్రమాద బాధ్యులుగా కలెక్టర్, ఎస్పీలను సస్పెండ్ చేయాలి : జడ శ్రావణ్ కుమార్ డిమాండ్

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వేట్లపాలెంలో బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు కోటి రూపా యలు పరిహారం అందించి, కుటుంబాల ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, ఈ ఘటనకు బాధ్యులుగా జిల్లా కలెక్టర్ ఎస్పీలను ఉంచి వారిని సస్పెండ్ చేయాలని జై భీమ్రావ్ భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో బాణాసంచా తయారీ కేంద్రంలో శనివారం జరిగిన విస్ఫోటన ప్రదేశాన్ని జేబిపి అధినేత జడ శ్రావణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. మాల మహా నాడు రాష్ట్ర నాయకులతో కలసి ఆయన పేలుడు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ప్రమాధంలో ప్రధానంగా దళిత కార్మికులే అధిక సంఖ్యలో మృతి చెందినట్టు శ్రావణ్ కుమార్‌కు వివరించారు. మృతదేహాలను గుర్తుపట్టలేనంతగా శరీర బాగాలు పంటపోలాల్లో ఏరుకోవాల్సి వచ్చిందన్నారు.

**ప్రమాదాన్ని రాజకీయం చేస్తున్నారు : ఎంపిపి :**

బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమా దాన్ని రాజకీయం చేస్తున్నారని ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు శ్రావణ్ కుమార్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలం వద్ద ఉన్న అనేక కరపత్రాలతో పాటు వైసీపికి చెందిన కరపత్రాలున్నాయంటూ ఆరోపిస్తూ ఈ ప్రమాదం వెనుక స్థానిక వైసీపీ నాయ కులు బొబ్బరాడ సత్తిబాబు హస్తం ఉండంటూ తనను కేసుల్లో ఇరికించేందుకు పార్టీలు ప్రయత్ని స్తున్నట్టు వివరించారు. దళితుడనైన తనను అణగ దొక్కేందుకే గతంలో కూడా జరిగిన ప్రమాదంలో తనను ఇరికించేందుకు చూశారని, ఈ విషయంలో తనకు రక్షణ



కల్పించాలని ఆయన కోరారు. కాగా ఈ సందర్భంగా నాయకులు శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు పరిహారం, వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, గాయపడ్డ కార్మికులకు యాభై లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంకా ఘటనకు బాధ్యులను చేస్తూ జిల్లా ఎస్పీ, కలెక్టర్లను సస్పెండ్ చెయ్యాలని, రాష్ట్రంలో అనుమతులు లేకుండా నడుస్తున్న పరిశ్రమలు, బాణాసంచా కేంద్రాలను పై చర్యల కొరకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఒక టాస్కోర్స్ ఏర్పాటు చెయ్యాలని శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాకినాడ పార్లమెంట్ కన్వీనర్ ఏనుగుపల్లి కృష్ణ, ఆంధ్ర రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు సిద్ధాంతుల కొండబాబు, రాష్ట్ర మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి లింగం శివ ప్రసాద్, జెబిపి కాకినాడ జిల్లా అధ్యక్షులు మల్లికా ర్జున్ రావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ కౌన్సిలర్ నేతల హరిబాబు తదితరులు ఉన్నారు.

# "కాణిపాకంలో అరుణోదయం" పుస్తక ఆవిష్కరణ

**కాణిపాకం, (రాజధాని వార్తలు):** శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి దివ్య సన్నిధిలో "కాణిపాకంలో అరుణోదయం" పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నాడు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది.

ముందుగా ముఖ్య అతిథులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఆస్థాన మండపంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి విశిష్ట అతిథిగా మాజీ మంత్రి, మాజీ శాసనసభ్యురాలు గల్లా అరుణ కుమారి హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పూతలపట్టు శాసనసభ్యులు కలికిరి మురళీమోహన్, గౌరవ అతిథిగా ఆలయ కార్యనిర్వాహక అధికారి పెంచల కిషోర్ పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల నడుమ రచయిత పత్రపాటి రమేష్ నాయుడు "కాణిపాకంలో అరుణోదయం" పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరిం చారు. అనంతరం రచయితను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు అతిథులు ప్రసంగిస్తూ, గల్లా అరుణకుమారి ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో కాణిపాకం దేవస్థానం అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆలయ అభివృద్ధి, భక్తుల సౌకర్యాల మెరుగుదల, మౌలిక వసతుల అభివృద్ధిలో ఆమె చేసిన సేవలు స్మరణీయమని అభినందించారు. గల్లా అరుణకుమారి మాట్లాడుతూ, స్వామివారి ఆశీస్సులతో ప్రజా సేవ చేసే అవకాశం లభించిందని, కాణిపాకం ఆలయ అభివృద్ధి తనకు ఎప్పటికీ ప్రత్యేకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మణి నాయుడు, డీపీఓ సుధాకర్ బాబు, ప్రముఖ రచయిత నామిని సుబ్రహ్మణ్యం, మాజీ ఈవో కేశవులు, అలాగే అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో అతిథు లకు జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# సంపాదకీయం

## ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి...

వారు ఎప్పుడూ నేర్చుకోరు, ఎప్పటికీ మారరు. ఒక సార్వభౌమిక దేశాన్ని దుర్బలం చేసేందుకు కలహశీల అమెరికా అధ్యక్షుడు ఒకరు మరోసారి విధ్వంసక దాడులకు పూనుకున్నారు. తన చర్యను సమర్థించుకునేందుకు పచ్చి అబద్ధాలు, సత్యదూర వాదనలు ప్రచారం చేస్తున్నారు. ఆ దౌర్జన్యాన్ని ముందస్తుగా సంకల్పించారు, ఆ దుష్ట సంకల్పం ప్రపంచానికి వెల్లడి కాకుండా మోసపూరిత శాంతి చర్చల తంతు జరిపారు. సంయమనం వహించాలన్న మిత్రదేశాల సలహాను పాటించలేదు. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయ నియమాలు, ప్రజాభిప్రాయాన్ని నిర్లక్ష్యం చేశారు, మరోసారి ఆ సార్వభౌమిక దేశంపై అత్యాధునిక విధ్వంసక ఆయుధాలతో విరుచుకుపడ్డారు. గతంలో వలే ఇప్పుడు కూడా అమెరికా దౌర్జన్య చర్య ఫలితం ఊహించలేనిదేమీ కాదు: ఇరాన్‌కు వ్యతిరేకంగా విస్తృతస్థాయిలో మళ్లీ ప్రారంభమైన అమెరికా-ఇజ్రాయెల్ దాడి మహా విధ్వంసంతో అల్లకల్లోలాన్ని సృష్టించింది. పరిస్థితులను ఇంకా భయానకం చేస్తోంది, అంతర్జాతీయ చమురు విపణి కుదేలయిపోతోంది. టెహ్రాన్ పాలకుల మద్దతు ఉన్న హెజ్బొల్లా, హౌతీ సాయుధ బృందాలు రంగంలోకి దిగడంతో కొత్త విద్వేషాలు రగుల్కొంటాయి, ఉగ్రవాద ప్రతీకారాలు విజృంభిస్తాయి. పాశ్చాత్య ప్రపంచ విరోధులు మాత్రమే పరమానందం పొందుతారు. సార్థక ఫలితాలు ఏవైనా సమకూరుతాయా? అసాధ్యం. అఫ్ఘానిస్థాన్, ఇరాక్‌లలో అమెరికా నేతృత్వాన పాశ్చాత్య దేశాల జోక్యపు చేదు ఫలితమే ఇప్పుడూ ఇరాన్‌లో చూడబోతున్నాం. అఫ్ఘాన్, ఇరాక్‌లలో జోక్యాలు క్షమించరానివి! ఆ చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోనేలేదు. ప్రపంచాన్ని తుపాకీతో బెదిరించి తాను నిర్దేశించినట్టు నడిచేలా చేయగలనని 21వ శతాబ్ది ప్రజలు ఎన్నుకున్న అమెరికా అధ్యక్షుడు ఒకరు విశ్వసించడం విస్మయకరం! నైతిక వివేచన పూర్తిగా కొరవడిన నిర్ణయ ఫలితమే ఇరాన్‌పై దాడి. జార్జి బుష్ హయాంలో 2003లో ఇరాక్ దురాక్రమణ, ఇప్పుడు ఇరాన్‌పై భీకర దాడులు రెండూ ఒకే విధమైనవి. ఇతర దేశాలలో అమెరికా జోక్యాలు? వియత్నాంలోనూ, 1953లో సీఐఏ ఆధ్వర్యంలో జరిగిన పాలన మార్పు రెండూ అంతిమంగా విఫలమయ్యాయి. ఆ వైఫల్యాలకు అమెరికా భారీ మూల్యమే చెల్లించవలసి వచ్చింది. విదేశాలలో అమెరికా జోక్యం చేసుకోవడాన్ని నివారిస్తానని ట్రంప్ వాగ్దానం చేశారు. అది కల్తీలేని బొంకుమాట. ప్రపంచ దేశాలతో అమెరికా సంబంధాల తీరుతెన్నులను ట్రంప్ మార్చివేయగలరని విశ్వసిస్తున్నవారు 1945 అనంతరం సామ్రాజ్యవాద దురహంకారంతో అది పాల్పడిన నీతిబాహ్య చర్యలను ఓసారి సమీక్షించండి. పూర్వపు అధ్యక్షులకు ట్రంప్ భిన్నమైన వ్యక్తి కాదు. జనవరిలో వెనెజువెలా అధ్యక్షుడిని అరెస్ట్ చేసి తీసుకువెళ్లిన తరువాత ఆ దేశంలోని చమురు సంపద మాత్రమే తనకు అవసరమని ట్రంప్ అన్నారు. అయితే ఆ తరువాత ఇతర విషయాలలో సంభవిస్తున్నది గమనిస్తే అమెరికా సామ్రాజ్యవాద జోక్యాల తుచ్ఛ చరిత్రకు భిన్నంగా లేదని అర్థమవుతుంది. జార్జి బుష్ మాదిరిగానే డొనాల్డ్ ట్రంప్ సైతం అబద్ధాలే పునాదిగా ఒక సంక్షోభాన్ని సృష్టించారు. బుష్, ఆయన సహ నేరస్థుడు టోనీ బ్లెయిర్ వలే ట్రంప్ సైతం ఉద్దేశపూర్వకంగా ఇరాన్ నుంచి సంభావ్య ముప్పును గోరంతలు కొండంతలు చేశారు. దీర్ఘ శ్రేణి క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేస్తోందని, వాటివల్ల యూరోపియన్ దేశాలలోని అమెరికా బలగాలకు ముప్పు ఏర్పడవచ్చని, ఆ క్షిపణులు అమెరికా భూభాగాలకు కూడా చేరగలవని పదే పదే చెప్పారు. సద్దాం హుస్సేన్ కల్పిత ఆయుధాల విషయంలో బుష్ ప్రభృతులు చేసినటువంటి తప్పుడు ప్రచారాన్నే ఇరాన్ విషయంలో ట్రంప్ చేశారు. ఇరాన్ దాడులకు సిద్ధమైనందునే తాము ముందస్తు దాడులు చేశామన్న ఇజ్రాయెల్ వాదనలో సత్యం ఏ మాత్రం లేదు. గత ఏడాది జూన్‌లో అమెరికా-ఇజ్రాయెల్ మొదటి సంయుక్త దాడి అనంతరం నెలకొన్న శాంతియుత పరిస్థితులను పరిరక్షించుకునేందుకే ఇరాన్ శతవిధాలా ప్రయత్నిస్తోంది. అణ్వాయుధాల తయారీ సామర్థ్యాన్ని సైతం ఇరాన్ వేగంగా సమకూర్చుకుంటోందని ట్రంప్ చేస్తున్న వాదనను గత ఇరవై ఏళ్లుగా ఇరాన్ పాలనావ్యవస్థ సర్వోన్నత అధినేత మొదలు జూనియర్ మంత్రి దాకా ప్రతి ఒక్కరూ ఖండిస్తూ వస్తున్నారు. 'తాము ఎట్టి పరిస్థితులలోనూ అణ్వాయుధాన్ని అభివృద్ధి పరచబోమని' ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అర్ఘాషి నిన్నగాక మొన్న స్పష్టంగా ప్రకటించారు. దీనిపై వాద ప్రతివాదాలు జరిగాయి. అయితే ఇరాన్ అణ్వాయుధాల తయారీలో పురోగతి సాధించినట్టు ఎటువంటి రుజువులను అమెరికా, ఐక్యరాజ్యసమితి అధికారులుగానీ నెతన్యాహు గానీ ప్రపంచానికి వెల్లడించలేకపోయారు. 'అమెరికా ప్రజాస్వామ్యానికి, ప్రపంచ భద్రతకు ట్రంప్ ఒక పెనుముప్పుగా పరిణమించారు' అని బరాక్ ఒబామా పాలనలో జాతీయ భద్రతా వ్యవహారాలలో కీలక బాధ్యతలు నిర్వహించిన బెన్ రోడెస్ వ్యాఖ్యానించారు. మన ఆధిక్యతను అంగీకరించని, మన మార్గాన్ని అనుసరించేందుకు సుముఖంగా లేని దేశాలను లొంగదీసుకోవాలని అమెరికన్ ఆదర్శాలు పురిగొల్పుతాయా? అని రోడెస్ విస్మయం వ్యక్తం చేశారు. ఇతర దేశాల కంటే అమెరికా స్వాభావికంగా ప్రత్యేకమైనది, విభిన్నమైనది, ఉన్నతమైనదని ప్రవచించే అమెరికన్ అసాధారణవాదానికి ఈయనొక వ్యక్తీకరణ. అయితే ఆ అసాధారణ వాదం ఒక మిథ్యా విశ్వాసమే. ఇరాన్‌పై దాడికి సర్వసన్నాహాలు చేస్తూనే ట్రంప్ ఆ దేశంతో రెండోసారి చర్చలు జరిపారు! జెనీవాలో జరిగిన ఆ చర్చలు ఎంత ప్రహసనప్రాయమైనవో ఇప్పుడు తేటతెల్లమయింది. తమ లక్ష్యాలను వెన్వెంటనే గరిష్ఠంగా సాధించుకోవడానికి సమష్టిగా పూనుకున్న ట్రంప్, నెతన్యాహులు ఇరాన్‌పై భీకర దాడులను ఇప్పట్లో నిలిపివేయడం జరగనిపని. 1979 ఇరానియన్ విప్లవంలో అమెరికాకు ఎదురైన అవమానాలకు అంతిమంగా ప్రతీకారం తీర్చుకున్న అధ్యక్షుడుగా చరిత్రలో నిలిచిపోవాలని ట్రంప్ అభిలషిస్తున్నారు.

# 4న వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి రాక

### - డిజిటలైజేషన్ త్వరగా పూర్తి చేయాలి - దక్షిణ సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** డిజిటలైజేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని వైసీపీ విశాఖ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ కోరారు. అశీలమెట్ట వద్ద గల పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన దక్షిణ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ అధిష్టాన వర్గం ఆదేశాల ప్రకారం డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని పిలుపు ఇచ్చారు. వచ్చే నెల 17తో జీ వీ ఎం సీ పాలక వర్గం కాల పరిమితి పూర్తవుతుందని గుర్తు చేశారు. కాబట్టి వచ్చే జీవీఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కోరారు. నియోజక వర్గంలో అన్ని వార్డుల్లో ఓటర్ల నమోదు చురుగ్గా జరగాలని కోరారు. చిరునామా మారిన వారు విధిగా ఓటర్ కార్డులో విధిగా వివరాలు మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకునేలా బూత్ కమిటీ నాయకులు శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే, ఇటీవల వివాహం చేసుకున్న తన కుమారుడు సాకేత్ శ్రావణి దంపతులను ఆశీర్వదించడానికి మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి మర్రిపాలెంలో గల తన నివాసానికి ఈ నెల 4న వస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు, అన్ని అనుబంధ సంఘాలు జగన్‌కి పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలకాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు అధ్యక్షులు దక్షిణ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు అనుబంధ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సెల్లార్ ఫ్లోర్లలో మూడు ఆక్రమణల తొలగింపులు

### - సెల్లార్ ఫ్లోర్లను ఆక్రమించిన వ్యాపారస్తులు స్వచ్ఛందంగా వెంటనే తొలగించుకోవాలి - జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు







**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థలో పలు జోన్ల పరిధిలో ఆపరేషన్ లంగ్స్ 3.0లో భాగంగా వాణిజ్య, వ్యాపార సముదాయాలలో, పలు అపార్ట్మెంట్లలో సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లలో వ్యాపారాలకు వినియోగి స్తున్న 3 ఆక్రమణలను సోమవారం తొలగించడం జరిగిందని, సెల్లార్ ఫ్లోర్లను ఆక్రమించిన వ్యాపారస్తులు స్వచ్ఛందంగా వెంటనే తొలగించుకోవాలని జీవీఎంసీ ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ.ప్రభాకర్ రావు సోమవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. నగర పరిధిలో ప్రజలు, వాహనదారులు రోడ్లపై, ఫుట్ పాత్‌లపై, బహిరంగ ప్రదేశాలలో వారి వారి వాహనాలను పార్కింగ్ చేస్తున్నందువలన రోడ్లు ఇరుకునకు గురై ట్రాఫిక్‌నకు అంతరాయం కలుగుతున్నందున ప్రజలు, వాహనదారుల ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సౌకర్యార్థం వాణిజ్య సముదాయాలు, పలు అపార్ట్మెంట్లలో సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లను పూర్తిగా కేవలం వాహనాలు నిలుపుకొనే సౌకర్యార్థం ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పంతో ఇప్పటికే ప్రారంభమైన ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా వెస్ట్ జోనులో 3 సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను జివిఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది పోలీస్ వారి సహకారంతో తొలగించడం జరిగిందని ముఖ్య పట్టణ ప్రణాళికాధికారి తెలిపారు.

ఆపరేషన్ లంగ్స్ 3.0 లో భాగంగా వెస్ట్ జోనులో 91వ వార్డులో గోపాలపట్నం వద్ద రామకృష్ణ నగర్ లో గ్రిల్స్‌తో మూసివేయబడిన సెల్లార్ ఫ్లోర్‌లో గ్రిల్స్‌ను తొలగించడం, సెల్లార్ ఫ్లోర్‌లో వున్న టివిఎస్ షో రూమ్ సర్వీస్ సెంటర్ తొలగించడం, నేతాజీ స్ట్రీట్‌లో సెల్లార్ ఫ్లోర్‌లో వున్న స్టాఫ్ లాకర్స్‌ను, టైలరింగ్ ఎక్విప్మెంట్ తొలగించడం జరిగిందని చీఫ్ సిటీ ప్లానర్ తెలిపారు. నగరంలో ఆపరేషన్ లంగ్స్ 3.0లో భాగంగా సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌ల ఆక్రమణలను తొలగించడం జరుగుచున్నందున, ఇప్పటికే పలు సెల్లార్/స్టిల్ట్ ఫ్లోర్‌లలో పార్కింగ్ కోసం కాకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను వెంటనే స్వచ్ఛందంగా ఆక్రమణదారులు తొలగించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా జోనుల సహాయక ప్రణాళిక అధికారులు, ప్రణాళిక విభాగం సిబ్బంది, సచివాలయం సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక పత్రికల సమస్యలను పరిష్కరించాలి

### - వెరిఫికేషన్ పేరుతో అక్రిడేషన్లు ఆపితే సమాచార శాఖను ముట్టడిస్తాం - జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి - లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో తీర్మానం





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** స్థానిక పత్రికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయని వాటిని పరిష్కరించాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. సోమవారం నగరంలోని డాబా గార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గతంలో పలుమార్లు వెరిఫికేషన్ జరిగిందని మరొకసారి 5 వేలు సర్కులేషన్ దాటిన స్మాల్ పత్రికలకు వెరిఫికేషన్ అవసరం లేదని, రాష్ట్రంలో ఎక్కడా వెరిఫికేషన్ లేదని సమావేశం అభిప్రాయపడింది. ఇలాంటి వేధింపులు ఆపకపోతే సమాచార శాఖను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాన్ ఎంప్యానల్డ్ దిన పత్రికలకు, 10 వేలలోపు సర్కులేషన్ కలిగిన ఎంప్యానల్డ్ పత్రికలకు ప్రెస్ అక్రిడేషన్లు పెంచాలని తీర్మానించారు. స్థానిక పత్రికల్లో వార్తలు రాసే ఫ్రీలాన్సర్లకు అక్రిడేషన్ సదుపాయం కల్పించాలన్నారు. రాష్ట్ర, జిల్లాస్థాయిలలో ప్రభుత్వం స్థానిక దిన పత్రికలు, పిరియాడికల్స్‌కు తగినన్ని యాడ్స్ విడుదల చేసి సహకరించాలని కోరారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో హామీ మేరకు నాలుగు సెంట్లు చొప్పున జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా రూ.10 వేలు చొప్పున పెన్షన్ల సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులు నివారణకు అటాక్స్ కమిటీలను వేయాలని, ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని తీర్మానించారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ జర్నలిస్టులు పూజారి సత్యనారాయణ, హరినాథ్, కె.ఎం.కీర్తన్ రావు, గుప్తా, మెట్ట కృష్ణారావు, ఆర్.అబ్బాస్, శశి, ఎం. శ్రీహరి, మురళీకృష్ణ, రమణ, ఎస్. సన్యాసిరావు, బి. ఏ.నాయుడు, కిషోర్, కె.కె రెడ్డి, పృధ్వీరాజ్, రాధ, వాసుదేవరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పేలుడు మృతుల కుటుంబాలకు మంద కృష్ణ మాదిగ పరామర్శ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** వేట్లపాలెం పేలుడు దుర్గటనలో మృతి చెందిన కుటుంబాలను ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.మందకృష్ణ మాదిగ సోమవారం సాయంత్రం పరామర్శించారు. సామర్లకోట పట్టణంలోని కుమ్మరి వీది, వేట్లపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించి మృతుల కుటుంబాలను కలిసి వారికి ధైర్యాన్ని చెప్పారు. ఈ సందర్బంగా ప్రమాధానికి గల కార ణాలపై విచారణ జరిపారు. కుటుంబాలకు అండగా నిలువనున్నట్టు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మందకృష్ణ వెంట స్థానిక తెదేపా నాయకులు తాతపూడి కృష్ణబాబు, కాపవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మొండెం లేని తల భాగం "సక్కుమళ్ళ రాఘవ" గా గుర్తింపు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో సంభవించిన బాణాసంచా పేలుడు దుర్ఘటనలో సోమవారం సాయంత్రం పంట పొలంలో లభించిన మొండెం లేని మహిళ తల భాగం మహిళ కార్మికురాలు సక్కుపల్లి రాఘవ (50)దిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీ డి శ్రీహరిరాజు సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలుపుతూ ప్రమాదంలో ఇదివరకు మృతుల జాబితాలో ఉన్న సక్కుమళ్ళ రాఘవకు సంబంధించిన పూర్తి అవయ వాలు పంచనామా సమయంలో లభించలేదన్నారు. గత రెండు రోజులుగా గాలింపు, డ్రోన్ సహాయంతో చేపట్టిన గాలింపులో భాగంగా ఆమె తల భాగం గుర్తించినట్టు డీఎస్పీ తెలిపారు. కుటుంబీకుల నిర్ధా రణతో ప్రస్తుతానికి అవయవ భాగాన్ని జగ్గంపేట తహసిల్దార్ ఆధ్వర్యంలో పంచనామా అనంతరం కుటుంబానికి అందించామన్నారు. అయితే డిఎన్ఏ పరీక్షలు జరిపి మరోసారి నిర్ధారణ చేరుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాగా వేట్లపాలెం సంఘటనా స్థలం వద్ద పోలీస్ పికెట్ అమల్లో ఉందని ప్రజలు ఎవరైనా ప్రమాదానికి సంబంధించి వివరాలు తెలియపరిచేందుకు సామర్లకోట పోలీస్ స్టేషన్లో గాని, పెద్దాపురం డిఎస్పీ కార్యాలయంలో గాని, అధికారులకు కానీ సమాచారం అందించాలన్నారు.

# పంట కోసుకునేందుకు అడ్డుకుంటున్న భూస్వాములపై చర్యలు తీసుకోవాలి

### - సీపీఐ, రైతు సంఘం నాయకుల డిమాండ్

**గూడూరు, (రాజధాని వార్తలు):** మా పంటను గ్రామ పెత్తందార్లు కోయనీయడం లేదని సిద్ధమ్మ కండ్రిగ గ్రామస్థులు సోమవారం చిల్లకూరు మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామస్థులకు సీపీఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు సివిఆర్. కుమార్ మాట్లాడుతూ చిల్లకూరు మండలం తొణుకుమాల గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 123లో 50 ఏళ్లుగా కోట మండలం సిద్ధమ్మ కండ్రిగ గ్రామ పేదలు సుమారు 54 ఎకరాల భూమిని 18 నిరుపేద కుటుంబాలు సాగుచేసుకుని జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. అయితే చిల్లకూరుకు చెందిన శేషరెడ్డి నెల్లూరుకు చెందిన రమేష్ రెడ్డి పేద రైతులను వారి పొలాల్లోకి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి పేద రైతులు నష్టపోకుండా పంట కోసుకునే అవకాశం కల్పించాలని కోరారు. సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి.శశి కుమార్ మాట్లాడుతూ పెత్తందారులు పేద రైతులకు అన్యాయం చేస్తున్నారని, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. పెనుబోలు రమేష్ రెడ్డి, శేషరెడ్డి గతంలో చల్లా వెంకటేశ్వర్లు పొలం పైప్ లైన్, సోలార్ సిస్టం, ప్రభుత్వం ఏర్పాటు చేసిన మోటారు, ఫెన్సింగ్ ధ్వంసం చేశారని, తహశీల్దారు, ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని నేటికీ న్యాయం చేయలేదన్నారు. ఆరుగాలం శ్రమించి నోటికొచ్చిన పంటను కోసుకునేందుకు అడ్డుకోవడం దారుణమన్నారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు నందవరం శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ డిప్యూటీ తహశీల్దార్ దృష్టికి తొణుకుమాల సమస్య తీసుకెళ్లామని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు జమాలుల్లా షేక్, బెల్లం కొండ వెంకటేశ్వర్లు, సిద్ధమ్మ కండ్రిగ గ్రామ రైతులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రాణాల గుప్పెట్లో కళ్యాణ్ రామ్ హీరోయిన్.. చంపేస్తారంటూ..




ఇరానియన్ బ్యూటీ ఎల్నాజ్ నొరౌజీ 'సేక్రేడ్ గేమ్స్' వెబ్ సిరీస్‌తో భారతీయుల మనసు గెలుచుకున్నారు. ఐతే ఇప్పుడు ప్రాణభయంతో ఆమె వణికిపోతోంది. గెరార్డ్ బట్లర్ వంటి హాలీవుడ్ స్టార్‌తో నటించి, తెలుగులో 'డెవిల్' సినిమాతో మెప్పించిన ఈమె, తన సొంత దేశం ఇరాన్‌కు వెళ్లలేనని తెగేసి చెబుతోంది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఖమేనీ మృతిపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. అక్కడ అడుగుపెడితే తనను చంపేస్తారంటూ ఆమె చేసిన షాకింగ్ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ వివరాలు చూద్దాం..ఎల్నాజ్ నొరౌజీ కేవలం ఎనిమిదేళ్ల వయసులోనే ఇరాన్ విడిచి ఐరోపాకు వెళ్లిపోయింది. అక్కడ మోడలింగ్‌లో రాణించి, భారత్‌కు వచ్చి హీరోయిన్‌గా ఎదిగింది. అయితే, తన దేశంలోని ప్రస్తుత ప్రభుత్వంపై ఆమె ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తూనే ఉంది. తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణ వార్త విన్న తర్వాత ఆమె బహిరంగంగా సెలబ్రేషన్స్ చేసుకోవడం ఇరాన్ వాళ్లకు కోపం తెప్పించింది. ఇక ప్రస్తుత ప్రభుత్వం దిగిపోయే వరకు తాను ఇరాన్‌లో అడుగుపెట్టలేనని, పొరపాటున వెళ్తే తనను ప్రాణాలతో వదిలిపెట్టరని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రాణాల మీద ఆశ ఉంటే అక్కడికి వెళ్లకపోవడమే మంచిదని ఆమె భావిస్తోంది. తెలుగులో నందమూరి కళ్యాణ్ రామ్ నటించిన 'డెవిల్' సినిమాలో ఎల్నాజ్ ఒక కీలక పాత్రలో కనిపించడమే కాకుండా, తన అద్భుతమైన లుక్స్‌తో స్పెషల్ సాంగ్‌లో దుమ్మురేపింది. ఆ పాట అప్పట్లో యూత్ మధ్య తెగ వైరల్ అయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, 'కాందహార్' వంటి హాలీవుడ్ చిత్రంలో గెరార్డ్ బట్లర్‌తో కలిసి నటించి తన సత్తా చాటింది. అయితే ఎంతటి పేరు ప్రఖ్యాతులు వచ్చినా, తన దేశంలోని మహిళల హక్కుల కోసం ఆమె గొంతు ఎత్తుతూనే ఉంది. హిజాబ్ వ్యతిరేక పోరాటాలకు మద్దతుగా నిలిచినందుకు ఇప్పటికే ఆమెను ఇరాన్ ప్రభుత్వ బహిష్కరణ చేసినట్టు సమాచారం. మరి భవిష్యత్తులో ఇరాన్‌లో పరిస్థితులు మారి ఎల్నాజ్ మళ్లీ తన సొంత ఊరికి వెళ్తుందో లేదో వేచి చూడాలి. ఇక ప్రస్తుతం ఎల్నాజ్ ఇండియాలోనే ఉంటూ తన కెరీర్‌ను కొనసాగిస్తోంది. ఇక్కడ తనకు లభిస్తున్న గౌరవం, భద్రత ఇరాన్‌లో లేవని ఆమె అంటోంది. తన గతాన్ని, తన దేశాన్ని ఎంతగా ప్రేమించినా, అక్కడి కఠిన నిబంధనలు మరియు రాజకీయ పరిస్థితులు తనను శత్రువులా చూస్తున్నాయని ఆమె వాపోతోంది. "ఒక నటిగా నేను స్వేచ్ఛను కోరుకుంటాను, కానీ నా దేశంలో ఆ స్వేచ్ఛకు తావులేదు" అని ఆమె కుండబద్దలు కొట్టి చెబుతోంది. ఇరాన్ ప్రభుత్వం మారి, ప్రజాస్వామ్యం వచ్చే వరకు తన నివాసం ఇండియానే అని ఆమె స్పష్టం చేసింది.

# హాఫ్ సెంచరీలు బ్యాక్ టూ బ్యాక్ అతడికే సాధ్యం!



ఈ రోజుల్లో సినిమా వారం రోజులు ఆడితే వంద రోజులు ఆడినట్లే. ఎందుకంటే 100 రోజుల కలెక్షన్స్ వారం రోజుల్లోనే సినిమాలు రాబడుతున్నాయి. దీంతో వంద రోజులు...50 రోజులు సినిమా థియేటర్లో పని లేకుండా పోతుంది. అన్ని రోజులు ఆడినా జనాలు చూసే స్థితిలో లేరు. ఎందుకంటే సినిమా రిలీజ్ అయిన రెండు..మూడు వారల్లోనే ఓటీటీలో రిలీజ్ అవుతుంది. ఇంకా ముందుగానే రిలీజ్ చేయాలనుకుంటే థియేటర్లో ఫ్లాప్ అయితే వారంలోనే ఓటీటీలో ఆ చిత్రం దర్శనమిస్తోంది. దీంతో ఎంత గొప్ప సినిమా తీసినా అందులో ఎంత పెద్ద స్టార్ నటించినా సినిమా అన్నది థియేటర్లో వారం మించి ఆడటం కష్టంగా మారింది. వారం దాటి ఆడితే ఆ చిత్రాన్ని గొప్పగానే చెప్పాలి. అలాంటి రోజుల్లో కూడా అనీల్ రావిపూడి ట్రెండ్ సెట్ చేస్తున్నాడు. తాజాగా అనీల్ రావిపూడి రీసెంట్ రిలీజ్ మన శంకర వరప్రసాద్ గారు దిగ్విజయంగా 50 రోజులను పూర్తి చేసుకుంది. 109 సెంటర్లలో ఈ చిత్రం అర్ధశత దినోత్సవాన్ని పూర్తి చేసుకుంది. దీంతో ఈ సినిమా ఎంత పెద్ద విజయం సాధించిందన్నది మరోసారి ప్రూవ్ అయింది. ఎంత భారీ హిట్ అయినా ఇన్ని రోజులు థియేటర్లో ఆడటం అన్నది చిన్న విషయం కాదు. అందులోనూ 100కి పైగా దాటిన సెంటర్లలోనే అంటే ఆషామాషీ కాదు. ఆ రకంగా అనీల్ పేరిట ఇదో రికార్డు. అనీల్ రావిపూడి పేరిప్పుడు టాలీవుడ్‌లో ఓ బ్రాండ్. ఇప్పటి వరకూ వైఫల్యమే ఎరుగని దర్శకుడిగా పేరుంది. డైరెక్ట్ చేసిన తొమ్మిది సినిమాలు బ్లాక్ బస్టరే. అవన్నీ ఒకదాన్ని మించి మరోటి విజయం సాధించిన చిత్రాలే. వీటిలో ఎనిమిది సినిమాలు 50 రోజుల పాటు థియేటర్లో దిగ్విజయంగా ఆడినవే ఓసారి వాటి వివరాల్లోకి వెళ్తే.. అనీల్ రావిపూడి దర్శకుడి పని చేసిన తొలి సినిమా పటాస్ బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించింది. కళ్యాణ్ రామ్ కెరీర్‌లోనే అతిపెద్ద హిట్‌గా నిలిచిన చిత్రమిది. దాదాపు అన్ని ప్రధాన కేంద్రాలలో 50 రోజులు పూర్తి చేసుకుంది. అటుపై మెగా మేనల్లుడు సాయితేజ్‌తో తెరకెక్కించిన సుప్రీమ్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను బాగా ఆకట్టుకుంది. ఈ సినిమా కూడా మెజారిటీ థియేటర్లలో 50 రోజులు ఆడింది. అలాగే మాస్ రాజా రవితేజ హీరోగా తెరకెక్కించిన రాజా ది గ్రేట్ మాస్ సెంటర్లలో 50 రోజుల మైలురాయిని సులభంగా దాటేసింది. వెంకటేష్-వరుణ్ తేజ్ కథానాయకులుగా తెరకెక్కించిన ఎఫ్ 2 ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్ చాలా సెంటర్లలో 50 రోజులు, కొన్ని చోట్ల 100 రోజులు కూడా ఆడింది. మహేష్ నటించిన సరిలేరు నీకెవ్వరు బాక్సాఫీస్ వద్ద స్ట్రాంగ్ రన్ సాధించి 50 రోజులు పూర్తి చేసుకుంది. అనంతరం ఎఫ్ 3 కూడా కీలక సెంటర్లలో 50 రోజులు ఆడింది. బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి కూడా సక్సెస్‌ఫుల్‌గా 50 రోజులు ఆడింది. ఇలా అనీల్ రావిపూడి ఖాతాలో అర్ధశత దినోత్సవం పూర్తి చేసుకున్న చిత్రాలున్నాయి.

# 'టాక్సిక్' బజ్ ఓకే..కానీ ఆ ధైర్యమేంటో!



పాన్ ఇండియా వైడ్‌గా సంచలనం సృష్టించిన కేజీఎఫ్‌కి ముందు యష్ అంటే కన్నడలో తప్ప ఇతర దక్షిణాది భాషల్లో ఎవరో ఎవరికీ తెలియదు. అలాంటి యష్‌ని దేశ వ్యాప్తంగా పాపులర్ అయ్యేలా చేయాడమే కాకుండా కన్నడ ఇండస్ట్రీకి దేశ వ్యాప్తంగా తిరుగులేని క్రేజ్‌ని తెచ్చి పెట్టింది. దీంతో కన్నడ సినిమాకు పాన్ ఇండియా వైడ్‌గా మంచి బజ్ క్రియేట్ అయింది. అలా కేజీఎఫ్ పుణ్యమా అని కన్నడ స్టార్స్ పాన్ ఇండియా సినిమాలకు శ్రీకారం చుట్టడం మొదలు పెట్టారు. అయితే ఈ విషయంలో రిషభ్ శెట్టి సక్సెస్ అయ్యాడే కానీ మిగతా వారు సక్సెస్ కాలేకపోయారు. దీంతో యష్ అంటే కర్ణాటకలోనే కాకుండా దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ మంచి క్రేజ్ ఏర్పడింది. కేసీఎఫ్ 2 బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న తరువాత యష్ నుంచి కేజీఎఫ్ 3 వస్తుందని అంతా ఊహించారు. అయితే దానికి భిన్నంగా లేడీ డైరెక్టర్ గీతూ మోహన్ దాస్‌తో యష్ టాక్సిక్ మూవీని చేయడం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో హాలీవుడ్ సినిమాల స్థాయిలో రూపొందిన ఈ సినిమా ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్ విమర్శల్ని ఎదుర్కోవడంతో టాక్సిక్ దేశ వ్యాప్తంగా వైరల్ అయింది. నెగెటివ్ ప్రచారం జరిగినా భారీ స్థాయిలో ఈ మూవీకి ఫ్రీ ప్రమోషన్ లభించింది. అఫీషియల్ టీజర్‌ని జనవరి 20న విడుదల చేశారు. దీంతో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. సినిమా బిజినెస్ రికార్డు స్థాయిలో జరిగింది. బజ్ కూడా భారీగానే ఉంది. మార్చి 19న దక్షిణాది భాషలతో పాటు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే ఏరియాల వైజ్‌గా బిజినెస్ కూడా పూర్తయింది. గ్లింప్స్, టీజర్‌లతో దేశ వ్యాప్తంగా ఈ మూవీపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే రిలీజ్ సమయం దగ్గరపడుతున్నా టీమ్‌లో ఎలాంటి పరుగు కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బజ్‌కు తగ్గట్టుగా మేకర్స్ ప్రమోషన్స్ ఎందుకు చేయడం లేదని, పేరే తెలియని డైరెక్టర్ సినిమా విషయంలో ఇంత ధైర్యం ఏంటో అని కన్నడ ఆడియన్స్ వాపోతున్నారు. ప్రమోషన్స్ విషయంలో స్పీడు పెంచాల్సింది పోయి ఇలా నత్తనడకన పని చేస్తున్నారనే కామెంట్‌లు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ రేంజ్ సినిమాని ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లేది పాటలే. అవే ఇప్పుడు టాక్సిక్‌కు మైనస్ అవుతున్నాయి. రీసెంట్‌గా తబాహి పాటని విడుదల చేశారు. యష్, కియారాలపై షూట్ చేసిన ఈ పాటకు సంబంధించిన విజువల్స్ లేకుండానే కేవలం ఒక ఫోటోతో పాటని రిలీజ్ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మిగతా సినిమాలు ఇప్పటికే ఆడియోతో నేషనల్ వైడ్‌గా సెన్సేషన్ క్రియేట్ చేస్తూ సినిమాపై భారీ బజ్‌ని సొంతం చేసుకుంటుంటూ టాక్సిక్ టీమ్ మాత్రం ప్రమోషన్స్‌ని అనుకున్న స్థాయిలో చేయడం లేదని పలువురు వాపోతున్నారు. మార్చి 19నే సంచలన మూవీ ధురంధర్ 2 కూడా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగా ప్రమోషన్స్‌తో అదరగొట్టాల్సిన టాక్సిక్ చాలా కూల్‌గా వ్యవహరిస్తుండటం, ఎలాంటి హడావిడీని ప్రదర్శించకపోవడం షాక్‌కు గురి చేస్తోంది. ఇప్పటి వరకు ట్రైలర్ రిలీజ్ చేయలేదు. మరి ట్రైలర్‌తో దేశ వ్యాప్తంగా హంగామా మొదలు పెడతారో వేచి చూడాల్సిందే.

# పక్కనే క్షిపణి పడింది.. చివరి కాల్ ఇంటికి.. హీరోయిన్ భయానక అనుభవం!



అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ మధ్యప్రాచ్య దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు సామాన్యులనే కాక సెలబ్రిటీలను కూడా వణికించాయి. ఈ భీకర యుద్ధ వాతావరణంలో చిక్కుకున్న బాలీవుడ్ హాలి బ్యూటీ ఇషా గుప్తా మృత్యువు అంచుల్లో నుంచి ప్రాణాలతో బయటపడి స్వదేశానికి చేరుకున్న తీరు ఒక హై-టెన్షన్ థ్రిల్లర్ సినిమాను తలపిస్తోంది. అబుదాబీ ఎయిర్‌పోర్ట్‌లో ఉండగా అకస్మాత్తుగా మొదలైన క్షిపణి దాడుల వార్తలు.. ఆ క్షణంలో ఈ నటి అనుభవించిన నరకయాతన వర్ణనాతీతం. ఆదివారం మధ్యాహ్నం 1 గంట సమయం.. ఎయిర్‌పోర్ట్ అంతా ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. సరిగ్గా అదే సమయంలో ఎయిర్ ట్రాఫిక్‌ను నిలిపివేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. బయట క్షిపణి దాడులు జరుగుతున్నాయన్న వార్త తెలియగానే ఎయిర్‌పోర్ట్‌లో ఒక్కసారిగా హాహాకారాలు మొదలయ్యాయి. తర్వాతి నిమిషం ఏం జరుగుతుందో తెలియని స్థితి.. గుర్తు తెలియని వ్యక్తులు ఒకరినొకరు ఓదార్చుకుంటూ.. కన్నీళ్లతో తమ కుటుంబ సభ్యులకు చివరి కాల్స్ చేసుకుంటున్న దృశ్యాలు నా కళ్ళముందే కదిలాయి! అంటూ ఇషా భయానక పరిస్థితులను గుర్తుచేసుకుని ఎమోషనల్ అయ్యారు. యుద్ధం వంటి అత్యవసర సమయాల్లో ఎయిర్ ట్రాఫిక్ ఆగిపోయినప్పుడు ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురవ్వడం సహజం. అలాంటి సమయంలో సంయమనం పాటించడం ప్రాణ రక్షణకు మొదటి మెట్టు. ఇషా గుప్తా తన అనుభవం ద్వారా చెప్పినట్లుగా.. విమానాశ్రయ భద్రతా సిబ్బంది సూచనలను తూచా తప్పకుండా పాటించాలి. గందరగోళానికి లోను కాకుండా... సురక్షిత ప్రాంతాలకు లేదా బంకర్లకు చేరుకోవాలి. కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతినే అవకాశం ఉన్నందున.. అందుబాటులో ఉన్న నెట్‌వర్క్ ద్వారా అధికారుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఇషా గుప్తా అదృష్టవశాత్తూ ఇంకా చెక్ ఇన్ పూర్తి చేయకపోవడంతో వెంటనే నిర్ణయం తీసుకుని తిరిగి అబూదాబీలోని హోటల్‌కు చేరుకోగలిగారు. ఆపద సమయంలో యూఏఈ ప్రభుత్వం, ఎయిర్‌పోర్ట్ గ్రౌండ్ స్టాఫ్ చూపిన ధైర్యం, ప్రయాణికులకు అందించిన భద్రత అమోఘమని ఆమె కొనియాడారు. హోటల్‌లో ఆ రాత్రి గడిపిన ప్రతి క్షణం ఒక యుగంలా గడిచిందని.. క్షేమంగా ఇండియాకు చేరుకోవడం కేవలం దేవుడి దయ, అభిమానుల ప్రార్థనల వల్లే సాధ్యమైందని ఇషాజీ కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధ భూమి నుంచి ఎస్కేప్ అయ్యి బ్యాక్ హోమ్ అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టిన ఇషా, తన ప్రాణాలను కాపాడిన యూఏఈ అధికారులకు, హోటల్ సిబ్బందికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. భయంకరమైన యుద్ధ వాతావరణం నుంచి బయటపడి మళ్లీ తన సొంత గడ్డపై కాలు పెట్టడం పునర్జన్మ లాంటిదని ఆమె అభివర్ణించారు. ఆ క్లిష్ట పరిస్థితుల్లో మానవత్వం ఎలా వెల్లివిరిసిందో.. అపరిచితులు కూడా ఒకరికొకరు ఎలా అండగా నిలిచారో ఆమె వివరించిన తీరు ప్రతి ఒక్కరినీ కదిలిస్తోంది.

# పి.జి.ఆర్.ఎస్, రెవెన్యూ క్లినిక్‌కు విశేష స్పందన

**- 200 వినతుల స్వీకరణ - రెవెన్యూకు సంబంధించిన 95 వినతులు -వినతులు పరిష్కారంలో సత్వర చర్యలు చేపట్టాలి - రెవెన్యూ సమస్యలపై వినతులను సకాలంలో పరిష్కరించాలి**
**- రెవెన్యూ వినతుల పరిష్కారంపై హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు, ప్రజలు - ముఖ్యమంత్రి హామీలు అమలు, వినతుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి : జిల్లా కలక్టరు ఎస్. రామ్ సుందర్ రెడ్డి**




**విజయనగరం, (రాజధాని వార్తలు):** సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పి జి ఆర్ ఎస్) మరియు 'రెవెన్యూ క్లినిక్' కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుండి ప్రజలు తరలి వచ్చి తమ సమస్కలపై వినతి పత్రాలు, ఫిర్యాదులు అందజేసారు.
రెవెన్యూపై ఫోకస్: అందిన మొత్తం 200 వినతుల్లో అత్యధికంగా 95 రెవెన్యూ శాఖవే ఉన్నాయి. పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ వినతుల పరిష్కారంలో వేగం పెంచాలని, వినతులు పరిష్కారంలో సత్వర చర్యలు చేపట్టాలని, రెవెన్యూ సమస్యలపై వినతులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలక్టరు ఎస్.రాం సుందరరెడ్డి రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా వచ్చిన వినతులు: రెవెన్యూ: 95, డిఆర్డిఎ-24, పంచాయతీ రాజ్: 17, మున్సిపల్-6 విద్యుత్ శాఖ-5, హౌసింగు-4, డిఎం అండ్ హెచ్ఒ-1, డిసిహెచ్ఎస్-3, గ్రామ సచివాలయ శాఖ-4, విద్య శాఖ-1, ఇతర శాఖలు-40 వినతులు వచ్చాయి. గౌరవ ముఖ్యమంత్రి జిల్లా పర్యటలో భాగంగా చీపురుపల్లిలో ఇచ్చిన హామీలు అమలు, ప్రజల వినతుల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధించిత అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లా కలక్టర్ ఎస్.రాంసుందరరెడ్డి, జిల్లా జాయింటు కలక్టరు సెతు మాధవన్ రెవెన్యూకి సంబంధించిన వినతులు, అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలు, రైతుల వినతులపై ఆరా తీసి వెను వెంటనే పరిష్కరిస్తున్నందున ప్రజలు, రైతుల నుండి సానుకుల స్పందన లభిస్తున్నది. ప్రజలు,రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
డిజిటల్ పర్యవేక్షణ: 1100 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా అందిన కాల్స్ పట్ల బాధ్యతగా వ్యవహరించాలని అధికారులకు అధికారులను ఆదేశించారు. ప్రతి వారం పి.జి.ఆర్.ఎస్ పురోగతిపై స్వయంగా సమీక్షిస్తున్నారని ఆయన తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్‌లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్‌కు అందిన కాల్స్‌కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయవలసి ఉంటుందన్నారు. ఆర్జిదారుల సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులను తగు చర్యలు, సత్వర పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యు క్లినిక్ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలక్టర్ సేతు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి ఇ.మురళి, జిల్లా స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, రాజేశ్వరి, బి.శాంతి, కళావతి, ఆర్.డి.ఓలు, జిల్లా సర్వే శాఖ ఎ.డి. ఆర్.విజయకుమార్, సి.పి.ఒ. బాలజి, డిఆర్ డిఎ పిడి, హౌసింగు పిడి, డి.ఇ.ఒ., మైక్రో ఇరిగెషను పిడి లక్మీనారాయణ, జెడ్పీ సిఇఒ సత్యనారాయణ, మార్క్ పెడ్ మేనేజరు డి.వెంకటేశ్వరరావు, కలక్టరేటు పరిపాలనాధికారి దేవి ప్రసాద్, జిల్లా పరిషత్ సిఇఒ బి.వి.సత్యనారాయణ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

**- 18 మందికి స్వల్ప గాయాలు : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు**



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** స్థానిక 26వ నెంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 18 మందికి స్వల్ప గాయాలయ్యాయని స్థానిక ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. ఆయన అందించిన వివరాల ప్రకారం సాలూరు నుంచి విజయనగరం వెళ్తున్న అల్ట్రా పల్లె వెలుగు బస్సు గజపతినగరం రైల్వే స్టేషన్ సమీపానికి వచ్చే సరికి ముందుగా వెళ్తున్న లారీని ఢీకొంది. ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ హఠాత్తుగా బ్రేక్ వేయడం వల్ల వెనకనుంచి వస్తున్న ఆర్టిసి అల్ట్రా పల్లె వెలుగు బస్సు లారీని ఢీకొంది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 18 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్.ఐ కే కిరణ్ కుమార్ నాయుడు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను గజపతినగరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు కేసు నమోదు చేశారు.


# 5న మహిళా దినోత్సవ వేడుకలు



**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ది సన్ స్కూల్‌లో ఈనెల 5వ తేదీన జనని యే జగతికి ఆధారం అనే పేరుతో మహిళా దినోత్సవ వేడుకలు, సాంస్కృతిక ఉత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురు ప్రసాద్ పేర్కొన్నారు. ఈరోజు సన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ మామిడి పాక అనిల్ కుమార్ తో కలిసి ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ ఐదో తేదీ ఉదయం 10 గంటలకు మంజూష నృత్య దర్శకత్వంలో అభినయ కళాక్షేత్రం విద్యార్థులు, బెల్లాన రాజు నృత్య దర్శకత్వంలో లయ లాస్య డాన్స్ అకాడమీ విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో అలరిస్తారని అన్నారు. ప్రముఖ గాయని శైలజా కుమారి, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం హాసిని సినీ, లలిత గీతాలు ఆలపిస్తారని పేర్కొన్నారు. 2026 సంవత్సరానికి గాను మహిళా దినోత్సవ పురస్కారాన్ని డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవికి ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ ఉత్తరాంధ్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పలుకూరి ప్రభావతి, డిమ్స్ కంప్యూటర్స్ రాజు, ప్రముఖ వ్యాపారవేత్త డివి సత్యనారాయణ, ఎన్ వి ఎన్ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు తాడేపల్లి నాగేశ్వరరావు, వనిత వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ వ్యవస్థాపకురాలు ముళ్ళపూడి సుభద్రాదేవి, పాఠశాల డీన్ రంగా, పరిపాలనాధికారి కోటి తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్, రెవిన్యూ వినతులను తక్షణమే పరిష్కరించాలి

**- మండల స్థాయి గ్రీవెన్స్ తగ్గేలా చర్యలు చేపట్టాలి**
**- ఇంచార్జి జాయింట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశం**




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన వినతులను తక్షణమే పరిష్కరించాలని ఇంచార్జి జాయింట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తహశీల్దార్లను ఆదేశించారు. మండల స్థాయి గ్రీవెన్స్ తగ్గేలా చర్యలు చేపట్టాలని అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ అంశాలు, వివిధ వినతుల పురోగతిపై తహసీల్దార్లతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ క్లినిక్ ద్వారా అందిన దరఖాస్తులపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొని సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. భూమి రికార్డులలో దొర్లిన తప్పుల సవరణ మరియు మ్యూటేషన్ దరఖాస్తులను గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా పారదర్శకంగా సేవలు అందించాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న భూ సర్వే ప్రక్రియ, హద్దుల నిర్ణయం మరియు సబ్-డివిజన్ పనులపై తహశీల్దార్ల నుంచి వివరాలు సేకరించారు. ఎక్కడైనా జాప్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిర్దేశించిన గడువులోగా రెవెన్యూ పనుల్లో పురోగతి చూపని పక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని తహశీల్దార్లు పాల్గొన్నారు.

# భారీ విస్ఫోటనంపై ప్రభుత్వమే బాధ్యత వహించాలి



**సామర్లకోట, (రాజధాని వార్తలు) :** సామర్లకోట మండలం వేట్లపాలెం బాణాసంచా పేలుడు ప్రమాదంలో 23 మంది మృతి చెందడం హృదయ విదారకరమైన దురదృష్టకరమైన సంఘటనని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. సోమవారం సామర్లకోట కుమ్మరి వీధి ప్రాంతంలో బాణాసంచా ప్రమాద ఘటనలో మృతి చెందిన దర్శిపాటి నాని, దర్శిపాటి పెద లోవరాజు, దర్శిపాటి రాజు, ఏడిద సామ్యూల్ కుటుంబాలను పెద్దాపురం నియోజకవర్గం వైసీపీ ఇంచార్జ్ దవులూరి దొరబాబుతో కలిసి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ వేట్లపాలెం ఘటనలో అమాయకులు మృతి చెందడం, వారి కుటుంబాలు నిరాశ్రయులు కావడం దురదృష్టకరం సంఘటనన్నారు. మృతుల కుటుంబాలకు వైఎస్ఆర్సిపి పార్టీ అండగా ఉంటుందన్నారు. బాణాసంచా కేంద్ర నిర్వాహకుడు అడబాల నాని ధనాపేక్ష కారణంగానే సుమారు 23 మంది ప్రాణాలు పోవడానికి కారణమని, ఈ సంఘటనకు పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ప్రభుత్వంలో పని చేస్తున్న అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ లేకపోవడం వలన 20 మంది పనిచేయ డానికి ఇచ్చిన లైసెన్స్ బాణాసంచా దుకాణంలో సుమారు 80 నుంచి 100 మంది వరకు యజ మాని పని చేయించడం జరుగుతుందన్నారు. స్థాయికి మించిన మెటీరియల్‌ను తయారు చేస్తున్నారని, దానికి సంబంధించి పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ళ మత్తులో తూలుతున్నారన్నారు. ప్రమాద ఘటనలో అత్యధికంగా దళితులు, బీసీలు ఉన్నారన్నారు. సుమారు మూడు నెలలు ముందు ఇటువంటి ఘటన మండపేట నియోజకవర్గం రాయవరంలో చోటు చేసుకుందని, గతంలో వేట్లపాలెంలో సైతం ఇటువంటి ప్రమాదాలు జరిగాయన్నారు. ఇటువంటి సంఘటనలు వరసుగా జరుగుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వలన పెద్ద ఎత్తున అమాయకులు మృత్యువాత పడ్డారని ఆయన అన్నారు. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని ఎమ్మెల్సీ విమర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ. 20 లక్షల రూపాయలు చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారని, నిరాశ్రయులైన వీరికి ప్రభుత్వం రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రతి కుటుంబంలో అర్హులైన వారికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పక్కా ఇల్లు నిర్మించాలని, మృతుల కుటుంబాలకు 5 ఎకరాల భూమిని కేటాయించాలని వైఎస్ఆర్సిపి పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నట్లు ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలను ఎమ్మెల్సీలతో పరామర్శించిన వారిలో సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజేష్, పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైసిపి ఆర్టీఐ వింగ్ ప్రెసిడెంట్ దర్శిపాటి సత్యానందం, బొమ్ము బుజ్జి తదితరులు ఉన్నారు.

# బాలల ఆరోగ్యకరమైన భవిష్యత్ ధ్యేయంగా సేవలందించాలి : ఆర్.బి.ఎస్.కె పిఓ డాక్టర్ జగన్ మోహన్



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** బాలల ఆరోగ్యకరమైన భవి ష్యత్ ధ్యేయంగా సేవలందించాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు సూచించారు. జిల్లా బాలల సత్వర చికిత్సా కేంద్రాన్ని (డిఈఐసి) సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రతీ రోజూ పిల్లలకు అందుతున్న ఆరోగ్య సేవలు మరియు మెరుగవుతున్న తీరుపై సిబ్బందితో సమీక్షించారు. 4డిలుగా గుర్తింపబడిన శారీరక, మానసిక వైకల్యం, ఎదుగుదలలో జాప్యం, పోషకాల లోపం, దీర్ఘకాలంగా, జన్యుపరంగా, పుట్టుక నుండి ఉన్న వ్యాధులు, లోపాలతో ఉన్న ఎంత మంది పిల్లలకు ప్రతీ రోజూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో వివిధ సమస్యలకు థెరపీలు, ఇంటర్వెన్షన్స్ ద్వారా అందుతున్న సేవలు, ఏ మేరకు సమస్య తగ్గి ఆరోగ్యం మెరుగు పడుతుందని నివేదికలు పరిశీలించి సమీక్ష జరిపారు. జిల్లాలో ఆరోగ్య కేంద్రాల నుండి ఆర్.బి.ఎస్.కె వాహనం ద్వారా ఎంత మంది 4డి బాలలు డిఈఐసి కేంద్రానికి పంపుతున్నారు, వారికి అందుతున్న సేవలపై తెలుసుకున్నారు. పిల్లల్లో 4డి సమస్యలను క్షేత్రస్థాయిలో, ఆసుపత్రుల్లో సకాలంలో గుర్తించాలన్నారు. ప్రతీ రోజూ కేంద్రానికి రిఫర్ కాబడుతున్న బాలలకు ఎటువంటి అసౌకర్యం, జాప్యం లేకుండా అంకితభావం, సేవాదృక్పథంతో వైద్య సేవలందించి వారి ఆరోగ్యకరమైన భవిష్యత్, జీవన ప్రమాణాలు మెరుగు పడటమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు.

# సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ.. ఏం చెప్పారంటే

**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితికి సంబంధించి శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని కేంద్రమంత్రి లేఖలో తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు 420 హామీలను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్ర ఖజానాలో డబ్బు లేదంటూ హామీల అమలుకు తప్పించుకుంటున్నారని విమర్శించారు. ఖజానా ఖాళీ అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... ఇటీవల ఓ సభలో కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ. 1,000 కోట్లు ఇవ్వడానికి సిద్ధమని చెప్పారని గుర్తుచేశారు. దీన్నిబట్టి చూస్తే.. 'రాష్ట్ర ఖజానా నిల్.. పార్టీ నాయకుల

**దాదాపు రూ.12 లక్షల కోట్లు**

కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి తెలంగాణ అభివృద్ధికి దాదాపు రూ.12 లక్షల కోట్లు మేర నిధులు కేటాయించిందని కేంద్రమంత్రి వివరించారు. ఇందులో పన్నుల వాటా రూ.2.5 లక్షల కోట్లు, రహదారులు రూ.1.85 లక్షల కోట్లు, రైల్వే బడ్జెట్ కేటాయింపులు రూ.36000 కోట్లకు పైగా, రైల్వే పనులకు మరో రూ. 50,000 కోట్లు, ఉపాధి హామీ రూ.40,000 కోట్లు, విద్యుత్ ప్రాజెక్టులు రూ.12,000 కోట్లు, పీఎం కిసాన్ నిధులు రూ.14,000 కోట్లు, ఉచిత రేషన్ రూ.50,000 కోట్లు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80,000 కోట్లు, విద్య.. క్రీడలకు రూ.21,000 కోట్లు, ఆరోగ్య సంరక్షణకు రూ.9,000 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కేంద్రప్రభుత్వం గత 12 సంవత్సరాల కాలంలో రైతుల నుంచి వరి సేకరణకు రూ.2.6 లక్షల కోట్లు, పత్తి సేకరణకు రూ.60,000 కోట్ల కనీస మద్దత ధర చెల్లించినట్లు తెలిపారు. కేంద్ర ఆర్థిక సంస్థల ద్వారా రూ.10 లక్షల కోట్ల ఋణాలు అందించారని చెప్పారు. 'స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ పథకం కింద వడ్డీ రహిత ఋణాలుగా రూ.10,000 కోట్లు పైగా ఇచ్చి మూలధన ప్రాజెక్టులకు సహకరించారని కేంద్రమంత్రి వివరించారు.

**అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులు...**

ఈ నిధులతో మురుగునీటి నాళాలు, రోడ్లు, రైల్వేలు, బ్రిడ్జిలు, ఆసుపత్రులు, మెడికల్- నర్సింగ్ కాలేజీలు, పాఠశాలలు, హాస్టళ్లు, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరి - మూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్‌లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులను ఖర్చు చేశారు.
ముఖ్యంగా ఎంఎంటీఎస్ ఫేజ్ - ఎఎ కోసం రూ.200 కోట్లు, మనోహరాబాద్-కొత్తపల్లి రైల్వేలైన్ కోసం రూ.114 కోట్లు, స్మార్ట్ సిటీస్ పథకం కోసం రూ.315 కోట్లు, పీఎం గ్రామ సడక్ యోజన కోసం రూ. 674 కోట్లు, ఓఆర్ఆర్ - ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం కోసం రూ.200 కోట్లు, సిద్ధిపేట బైపాస్ రోడ్డు కోసం రూ. 110 కోట్లు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల కోసం రూ. 388 కోట్లు, పలు హాస్టళ్ల నిర్మాణం కోసం రూ.300 కోట్లు వంటి ప్రాజెక్టులు ఉన్నాయని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

**అన్నీ ఋణాలపైనే ఆధారం..**

రాష్ట్ర ప్రభుత్వం.. జీతాలు, సంక్షేమ పథకాలు, రైతు భరోసా వంటి వాటికి కూడా ఋణాలపై ఆధారపడుతోందని కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్ర తలసరి అప్పు పెరుగుతోందన్నారు. 2014లో మిగులు నిధులతో ఏర్పడిన రాష్ట్రానికి గత 10 సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో, గత 27 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణకు పట్టిన దుస్థితికి నేటి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అద్దం పడుతోందని విమర్శించారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని లేఖలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

# జిల్లా అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక సిద్ధం చేయండి

## - జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజక వర్గాలను వచ్చే 5 సంవత్సరాలలో ఏవిధంగా అభివృద్ధి చేయాలనే దీర్ఘకాలిక లక్ష్యాల ప్రణాళికను ప్రాధాన్యతా అంశాలతో క్రోడీకరించి 15 రోజులలో సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమలాపురం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించి గ్రాస్ డొమెస్టిక్ ప్రోడక్ట్ 15% వృద్ధిరేటు సాధన, పి 4 బంగారు కుటుం బాల దత్తత తనిఖీ, కి పెర్ఫార్మన్స్ ఇండికేటర్స్ అప్లోడ్ అంశాల ప్రగతిపై సమీక్షించారు. నిర్దేశిత ప్రాధాన్యత అంశాల వారీగా లక్ష్యాలను సాధించడానికి తీసుకునే కార్యాచరణ ద్వారా జిల్లా అభివృద్ధికి పాటు పడుతూ రాష్ట్రంలో జిల్లాను ముందంజలో నిలపాలన్నారు. ప్రాధాన్యత అంశాలైన తాగునీరు, రహదారులు, విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, ఉపాధి, గ్రామ, వార్డు స్థాయి డేటా సేకరణ, లోటుపాట్ల విశ్లేషణ, ప్రాధాన్యత, బడ్జెట్ అంచనా నిధుల, వనరులు సమీకరణ వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలన్నారు. నిర్దేశిత పనులు ఎంతవరకు పూర్తి చేశారు వంటి కొలిచే ప్రమాణాలైనాకి పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ తాగునీరు శాతాలను, గ్రామాలకు పైపులైన్ కనెక్షన్‌లు, రహదారులు, పూర్తి చేసిన రోడ్ల పొడవు, విద్య, పాఠశాల హాజరు శాతం, ఆరోగ్యం పీహెచ్‌సిలో ఓపి సందర్శనలు, పింఛన్ల పంపిణీ శాతాలను ప్రతి నెల 5వ తేదీన అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం ఆధారంగా దత్తత కార్యక్రమం పి4 సమర్థవంతంగా అమలు చేస్తూ కిందిస్థాయి నుండి పేదరిక నిర్మూలనకు పట్టం కట్టాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ పథకంలో మార్గదర్శకులైన పది శాతం ధనికులు సమాజంలో కింది స్థాయి నుండి 20 శాతం బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని జీవన ప్రమాణాల బలోపేతానికి పాటుపడాలన్నారు. పి4 దత్తత తనిఖీ చెక్‌లిస్ట్ ఆధారంగా సచివాలయం సిబ్బంది సమగ్ర తనిఖీ నిర్వహించి వేగవంతంగా అర్హులకు న్యాయం చేకూర్చాలన్నారు. జిల్లాలో స్థూల దేశీయోత్పత్తి జిడీపీ పెంపును లక్ష్యంగా చేసుకుని స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ యూనిట్ల ద్వారా సమగ్రంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విజన్ ప్లాన్ యూనిట్‌ను, 6 నియోజక వర్గాల్లో ప్రత్యేక విజన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు వివరిం చారు. ప్రతి నెల ఐదో తేదీ నాటికి కీ పెర్ఫార్మన్స్ ఇండికేటర్స్ ఆన్లైన్లో అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఓ మురళీకృష్ణ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలలు, కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోండి

## - విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ మహేష్ కుమార్

## - గోడ పత్రికను ఆవిష్కరించిన కలెక్టర్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో గురుకులాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 5, 6, 7, 8 తరగతులు, జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ మరియు డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. గురుకులాలలో ప్రవేశాల కల్పనకై ముద్రించిన ప్రచారగోడ పత్రికను ఆయన అమలాపురం కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ప్రతిభ గల గ్రామీణ ప్రాంత పేద విద్యార్థుల సంపూర్ణ వికాసం, గురుకుల విద్యాలయాల ద్వారా సాకారం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు ఉచిత వసతి, సంరక్షణ, పౌష్టిక విలువలతో కూడిన భోజనం, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన, పర్యవేక్షణ ఉంటుందన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సీఎంఏ/ సిఏ, ఎన్‌ఈ ఈటి, ఐఐటి ఇతర పోటీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారన్నారు. క్రీడలు, కళలు, సహ పాఠ్యాంశాలు, ఆరోగ్యం, వినోదం, వికాసంతో కూడిన విద్యా ప్రణాళిక ఉంటుందన్నారు. మెరుగైన విద్యా బోధనలతో విద్యార్థుల భవిష్యత్తుకు పటిష్టమైన పునాదులు నిర్మిస్తారన్నారు. దరఖాస్తు చేయు విధానం https:// aprs.apcfss.in నందు 18-02-2026 నుండి. 31-03-2026 దరఖా స్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు వెబ్ సైటును సందర్శించాలన్నారు. ఎంపిక చేయు విధానం సంబంధిత ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ఉంటుందని వివిధ కేటగిరీలలో నిర్దేశించన రిజ ర్వేషన్‌లు పాటిస్తూ ప్రవేశాలు కల్పించబడునన్నారు. APRS CAT-2026 5వ తరగతిలో అన్ని సీట్లకు, 6, 7 & 8వ తరగతులలో మిగిలి వున్న సీట్లకు ప్రవేశ పరీక్ష అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో తేది 24-04-2026 ఉదయం 10-00 గం॥ల నుండి మధ్యాహ్నం 12-00 గం॥ల వరకు నిర్వహిస్తారన్నారు. APRJC & DC CET-2026 ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశ పరీక్ష అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో తేది 24-04- 2026 మధ్యాహ్నం 2-30 గం॥ల నుండి 5-00 గం॥ల వరకు జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే పంపిణీ చేయబడుచున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర, తల్లికి వందనం మొదలైన పథకాలు పొందుటకు నిబంధనల మేరకు అర్హతలు నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తున్న ఏడుకొండల స్వామి : జమ్మలమడక నాగమణి

**- రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో ప్రజల కోసం చేసిన పని ఏదీ లేదు...స్కాములే! - లడ్డు ప్రసాదంపై చంద్రబాబు చేసిన విషప్రచారానికి దెబ్బతీసిన తిరుమల వెంకన్న - టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు వికూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తున్న ఏడుకొండల స్వామి రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో ప్రజల కోసం చేసిన పని ఏదీ లేదు...స్కాములే! - లడ్డు ప్రసాదంపై చంద్రబాబు చేసిన విషప్రచారానికి దెబ్బతీసిన తిరుమల వెంకన్న - టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు వివాదాలతో తిరుమల పవిత్రతకు చెడ్డ పేరు**



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** పవిత్ర తిరుమల పుణ్యక్షేత్రాన్ని రాజకీయ లాభాల కోసం వాడుకోవాలని చూసిన కూటమి ప్రభుత్వాన్ని ఏడుకొండల స్వామి స్వయంగా కూకటివేళ్లతో పెకిలిస్తున్నాడని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఘాటుగా విమర్శించారు. రెండేళ్ల పాలనలో కూటమి చెప్పుకోదగ్గ అభివృద్ధి ఏదీ లేకుండా స్కాం, అవినీతి, వివాదాలు మినహా ఇంకేమీ లేదని ఆరోపించారు. తిరుమల లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వు ఉన్నట్టు చంద్రబాబు ప్రచారం చేయడం ప్రపంచ వ్యాప్తంగా హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని ఆమె మండిపడ్డారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజార్చిన ఈ తప్పుడు ప్రచారానికి చంద్రబాబు తప్పించుకోలేరని స్పష్టం చేశారు. కల్తీ నెయ్యి వ్యవహారం విషయమై, లడ్డు ప్రసాదం తయారీలో ఉపయోగించే నెయ్యి సరఫరాలో హెరిటేజ్ అనుబంధ సంస్థ ఇందాపూర్ పాత్ర బయటపడిందని తెలిపారు. అదే సమయంలో, శ్రీ వైష్ణవి డైరీకి సంబంధించి అనుమానాస్పద మార్పులు, టిడిపి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు చెందిన సంఘం డైరీతో లింకులు ఉన్నట్టు తేలిందని గుర్తు చేశారు. తాజాగా టిటిడి పాలకమండలి చైర్మన్ బిఆర్ నాయుడు రాసలీలల వివాదం తిరుమల పవిత్రతను మసకబార్చిందంటూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిత్త శుద్ధి ఉంటే వెంటనే బిఆర్ నాయుడిని చైర్మన్ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. రెండేళ్ల కూటమి పాలనలో ఎమ్మెల్యేల రహస్య వీడియోలు, వ్యక్తిగత సంబంధాలే వార్తల్లో నిలుస్తున్నాయని, ప్రజలకు చేసిన ఒక్క మేలు కూడా చెప్పలేని పరిస్థితి వచ్చిందని ఆమె ఎద్దేవా చేశారు. భూములను కారు చౌకగా తమ అనుచరులకు కట్టబెట్టడంలో కమీషన్ల పాలన సాగుతుందని ఆరోపించారు.

# అమర జవాన్ నాగబాబుకు ఎంపీ గంటి హరీష్ బాలయోగి ఘన నివాళి

## - గ్రామ కూడలిలో నాగబాబు విగ్రహం ఏర్పాటుకు చర్యలు





**అమలాపురం, (రాజధాని వార్తలు):** దేశ రక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అమర జవాన్ బడుగు నాగబాబు సేవలు చిరస్మరణీయ మని అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ బాలయోగి కొనియాడారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బడుగు నాగబాబు సెలవుపై ఇంటికి వచ్చి విధులలో చేరేందుకు వెళ్లే తరుణంలో తీవ్ర అనారోగ్యానికి గురై ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలిసిందే. బోడసకురులో సోమవారం నిర్వహించిన నాగబాబు సంతాప సభకు ఎంపీ హరీష్ బాలయోగి విచ్చేసి జవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుమారు 24 ఏళ్లపాటు భారత సైన్యంలో వివిధ హోదాల్లో దేశానికి సేవలందించిన నాగబాబు మృతి చెందడం కోనసీమ ప్రాంతానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పోరాడే సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాగబాబు కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలు అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దేశానికి సుదీర్ఘ కాలం సేవలందించిన జవాన్‌కు అంత్యక్రియల సమయంలో దక్కాల్సిన అధికార లాంఛనాలు, గౌరవ వందనం విషయంలో జరిగిన జాప్యంపై ఎంపీ హరీష్ మాధుర్ అసహనం వ్యక్తం చేశారు. సైనికుల పట్ల గౌరవం తగ్గకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన గుర్తు చేశారు. ఆర్మీ జవాన్ బడుగు నాగబాబు మృతికి సంతాపం తెలియజేస్తూ పోలీసులు గౌరవ వందనంతో పాటు కుటుంబ సభ్యులకు ఆర్మీ అధికారులు జాతీయ జెండా అందజేశారు. రాజస్థాన్ 27 ఎడి ఎంఎస్ఎల్ ఆర్ఈజిటి నుండి సుబేదార్ వై.వి.రావు, హవల్దార్ వి.కే కుమార్ పెచ్చెట్టి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్ల మెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్, గ్రామసర్పంచ్ రొక్కల విజయ లక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లం రాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్, దాకవరపు చిరంజీవి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, సాధనాల శ్రీనివాస్, సాపే ధర్మరాజు, జల్లి రాధా కృష్ణ, మొయిల గణపతి, ముత్యాల బాబి, రొక్కల నాగేశ్వరరావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే కీలకం




**కాజులూరు, (రాజధాని వార్తలు):** విద్య అనేది ప్రతి మనిషి జీవితాన్ని మలిచే శక్తివంతమైన సాధనమని, సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి విద్య అత్యంత అవసరమని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నాయని ముఖ్యంగా ఒత్తిడి లేని విద్యా విధానం, ఉచిత భోజనం, పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు వంటి అంశాలు ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతను చూపిస్తున్నాయని కుయ్యేరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డిడి ప్రసన్న కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కోలంక గ్రామంలో కుయ్యేరు జిల్లా పరిషత్ పాఠశాలలో లభిస్తున్న సౌకర్యాలను తెలియజేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు వద్దకు వెళ్లి పాఠశాల ప్రత్యేక తను తెలియజేసి తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఒత్తిడి లేని విద్యా వాతావరణం ఉంటుంది. విద్యార్థులపై అనవసరమైన పోటీ ఒత్తిడి లేకుండా, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే విధంగా బోధన జరుగుతుందని ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రేమతో, సహనంతో మార్గనిర్దేశనం చేస్తారనీ దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, సృజనాత్మకత అభివృద్ధి చెందుతుందన్నారు. ఉచిత మధ్యాహ్న భోజన పథకం ప్రభుత్వ పాఠశాలల ప్రధాన ఆకర్షణని భారత దేశంలో విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారం అందిస్తున్నారన్నారు. ఈ పథకం వల్ల పేద కుటుంబాలకు ఉపశమనం కలుగుతుందనీ, పిల్లలు ఆకలితో కాకుండా ఆరోగ్యంగా చదువుపై దృష్టి పెట్టగలుగుతున్నారనీ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపా యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని, విశాలమైన తరగతి గదులు, శుభ్రమైన తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, డిజిటల్ తరగతులు, గ్రంథాలయాలు వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సమగ్ర శిక్ష వంటి పథకాల ద్వారా విద్యారంగంలో సమగ్ర మార్పులు తీసుకొస్తున్నారని, ఈ మార్పులు విద్యార్థుల అభ్యాసన నైపుణ్యాలను పెంపొందించడంలో సహాయపడుతున్నాయన్నారు. అదనంగా, ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యేతర కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తారని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన ప్రదర్శనలు వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతోందని ఇది వారికి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సామాన్య ప్రజలకు నాణ్యమైన విద్యను అందిస్తూ సమాన అవకాశాలను కల్పిస్తున్నాయి. ఒత్తిడి లేని విద్యా విధానం, ఉచిత భోజనం, సమృద్ధిగా మౌలిక సదుపాయాలు వంటి అంశాలు విద్యార్థుల జీవితాలను మార్చే శక్తి కలిగి ఉన్నాయని అందువల్ల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే నిజమైన పునాది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఉమా కాంత్, కె వి వి ఎస్ యం నాగేశ్వరరావు, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా బీజేపీ జనతా వారధి

## - లిక్కర్ కేసులో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్

## - జేసీకి వినతి పత్రం అందజేసిన అడబాల, నల్లా పవన్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** గత వైసీపీ ప్రభుత్వం పాలనలో లిక్కర్ పాలసీలో జరిగిన భారీ ఆర్థిక కుంభకోణంలో నిందితులను వెంటనే అరెస్టు చేసి పూర్తి దర్యాప్తు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చీకురుమెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట జనతా వారధి హెల్ప్ లైన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ఆదేశాలతో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా జనత వారిధి నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడానికి తగిన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. 2019-2024 సంవత్సరాల మధ్య జరిగిన లిక్కర్ కుంభకోణంలో నిందితులను అరెస్టు చేయాలని జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిశాంతికి వారు పిర్యాదు చేశారు. ఫిర్యాదుపై స్పందించిన జేసి విచారణ జరిపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం అమలాపురం 25వ వార్డులో మంచినీటిలో డ్రైన్ నీరు కలిసి కలుషితం అవుతుందని స్థానిక మహిళలతో కలిసి జేసీకి ఫిర్యాదు చేశారు. త్రాగునీరు విషయమై తక్షణం చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణ అధ్యక్షులు అయ్యల భాషా, రూరల్ మండల అధ్యక్షులు బొంతు శివాజీ, అయినవిల్లి మండల అధ్యక్షులు యనమదల వెంకటరమణ, అల్లవరం మండల అధ్యక్షులు నారాయణ మూర్తి, సీనియర్ నాయకులు గోకర కొండ గంగన్న స్వామి, మైనారిటీ మోర్చా అధ్యక్షులు సంసు సాదిక్, డీవీఎస్ రాజు, బండి శ్రీను, దాకే వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call

9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్స్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688899
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996


## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్లానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి


## - పిజిఆర్ఎస్ వ్యవస్థ మరింత బలోపేతం : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా జిల్లా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ మందిరంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దిలీప్ చక్రవర్తితో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం కోసమే ఆయా మండలాలలో కూడా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, స్థానిక సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకానికి తగ్గట్టుగా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులు చాలా సున్నితమైనవని వాటిని నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామ, మండల స్థాయి అధికారులు చురుగ్గా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని పేర్కొన్నారు. అర్జీదారుని సమస్య పూర్తిగా పరిష్కారమైందా లేదా అనేది ఫీల్డ్ విజిట్ చేసి ధృవీకరించాలన్నారు. పిజిఆర్ఎస్ పోర్టల్ ద్వారా ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత సమయంలోగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయం కలిగి ఉండాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో ఆలస్యం చేసినా, నిర్లక్ష్యం చూపిన అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పిజిఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తులు రెవెన్యూ వినతులు: 50. ఇతర వినతులు:56. మొత్తం 106 దరఖాస్తులు స్వీకరించినట్టు తెలిపారు.

# మోటార్ సైకిల్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్

## - అక్కడికక్కడే యువకుడు మృతి




**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కొంకపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు మోటార్ సైకి ల్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన రేవు దినేష్ కుమార్ (28) సోమవారం సాయంత్రం అమలాపురం వైపుకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఎత్తు రోడ్డు హెచ్‌పి గ్యాస్ సమీపంలో మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్ లిస్ట్ దినేష్ కుమార్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పో యాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం మిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాజోలు డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సును అమలాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మరిడమ్మ ఆలయంలో "చండీహోమ" పూజలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీ మరిడమ్మ అమ్మ వారికి పౌర్ణమి సందర్భముగా సోమవారం విశేష పూజలు చేపట్టారు. అమ్మవారికి "చండీ హోమం" జరిపి ఆసాదులు, వేదపారాయణ దారులు ప్రత్యేక పూజలు, అర్చన కార్యక్రమములు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారికి ఆలయ అధికారిణి కె విజయ లక్ష్మి ఆధ్వర్యంలో పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు. ఈ పూజల్లో ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు పాల్గొని సేవలు అందించారు.

# చేజర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

## - రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలి




**చేజర్ల, (రాజధాని వార్తలు):** చేజర్ల మండల పరిధిలోని పాతపాడు, యనమదల గ్రామాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం గ్రేడ్-ఏ రకానికి క్వింటాలుకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 కనీస మద్దతు ధరగా నిర్ణయించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ధాన్యంలో తేమ శాతం 17 శాతానికి మించకూడదని స్పష్టం చేశారు. 17% లోపు తేమ ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యం తీసుకురావాలని కోరారు. పాతపాడు కేంద్ర ప్రారంభోత్సవంలో ప్రైమరీ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ వీర రాఘవరెడ్డి, సర్పంచ్ చిరంజీవి రెడ్డి, రైతులు ప్రేమ్‌కుమార్, ఈశ్వర్ రెడ్డి, పెంచల రెడ్డి పాల్గొన్నారు. యనమదల కేంద్ర ప్రారంభంలో చైర్మన్ వీర రాఘవరెడ్డి, రైతు సంఘ నాయకుడు నోటి వెంకట రామిరెడ్డి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు హర్షిణి, మాధురి, మండల వ్యవసాయ అధికారి పి.ఎస్. హిమబిందు పాల్గొన్నారు. రైతులు పెద్దఎత్తున హాజరై కొనుగోలు ప్రక్రియపై అవగాహన పొందారు.

# అంగన్వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే



**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేసిన అప్పులకు కూటమి ప్రభుత్వం వడ్డీలు కట్టుకుంటూ రాష్ట్ర పాలన సాగిస్తుందని యువగళంలో ఇచ్చిన హామీలను, అలాగే ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ పాలన సాగిస్తున్నామని, ఎన్నికల ప్రచారంలో అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు, సూపర్వైజర్లకు, సిడిపిఓల సమస్యలను కూటమి ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుందని కొద్దిగా సమయం పడుతుందని కచ్చితంగా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రెండు దఫాలుగా జీతాలు కూడా పెంచామని రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను గ్రహించి కూటమి ప్రభుత్వానికి కొద్దిగా సమయం ఇస్తే ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కచ్చితంగా నెరవేరుస్తామని తెలిపారు. ఆమె వెంట తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకు తోట రమేష్, సుధాకర్ రెడ్డి, రైతు సేవా సంఘం చైర్మన్ ఏజి కిషోర్, చిట్టేటి పెరుమాళ్ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan